పాత్రే ప్రాణం

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 24, 2016

KSR02B118 c
ENTERED

మన మహిళా ముఖ్యమంత్రులు





మాయా చిత్రాలు

సినిమాలు కొన్ని వాస్తవానికి దగ్గరగా ఉండే కథలైతే ఇంకొన్ని ఊహాలోకపు అంచుల్ని తాకించే కల్పితాలు. ప్రేక్షకులని గ్రాఫిక్స్ మాయాజాలంలోకి లాక్కెళ్లే విజువల్ ఎఫెక్ట్స్ ఓ మంత్ర దండం. ఎత్తైన పర్వత లోయల్లో జయపాతాలు, ఆకాశహార్మ్యాల అంచున సాగే స్టంట్‌లు, భారీ సైన్యంతో అద్భుత పోరాట దృశ్యాలు, ఒళ్లు గగుర్పాటు కలిగించే ఛేజింగ్‌లు, విచిత్ర జీవాల దృశ్యాలు ఇలా దేన్నైనా తెరపై సాధ్యం చేస్తాయవి. ఒకప్పుడు భారీ సెట్‌లు ఎంతో భారాన్ని వేసేవి. ఇప్పుడు వాటి స్థానంలో బ్లూ లేదా గ్రీన్ మ్యాట్‌లు, తెరలు వేసి సన్నివేశాన్ని చిత్రీకరించి ఆపై కంప్యూటర్ జనరేటెడ్ బ్యాక్‌గ్రౌండ్‌తో మొత్తం చిత్రాన్నే మార్చేస్తారు. వాటి సహజత్వాన్ని సెట్‌లు కూడా ఇవ్వలేనంత క్లియర్‌గా ఉంటున్నాయి ఈ మధ్య గ్రాఫిక్స్. కలల లోకంలోని గ్రహాలు, జీవులు ప్రాణం పోసుకుని 'అవతార్' పండోరా లోకాల్లో విహరింపజేశాయి. ఇక 'లైఫ్ ఆఫ్ పై' మనకు తెలీని మన సముద్రాన్ని ఆవిష్కరించింది. 'చాందినీ చౌక్ టు చైనా టౌన్' చిత్రం నుంచి 'బాహుబలి' వరకు ఇవే ఎస్సెట్స్. చిత్రీకరణ జరిగేటపుడు వాటి స్థానంలో ఉండేవి డమ్మీ సెట్లు, తెరలేనంటే అస్సలు నమ్మ బుద్ధి కాదు. అందుకే హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు వీటి చిత్రీకరణ సంబంధించిన పిక్చర్‌లిస్తున్నాం. వీటిని చూస్తే ఎంత మాయ చేస్తున్నారో మనకో పిక్చర్ వస్తుంది.





KSR02B118

సేవ

గొంతు క్యాన్సర్ రోగులకు శస్త్రచికిత్సల ద్వారా వైద్యులు ప్రాణాల్ని నిలబెట్టినా మాట్లాడగలిగే అవకాశం కోల్పోవడం సాధారణం. రోగులు తిరిగి మాట్లాడగలిగేందుకు అధునాతన వాయిస్ ప్రొస్తెసిస్‌లున్నా వాటి ధర అందుకునేది కాదు. వారి ఆవేదన అర్థం చేసుకుని ప్రముఖ అంకాలజిస్ట్, సర్జన్.. డాక్టర్ విశాల్ రావ్ 'వన్ డాలర్ వాయిస్ ప్రొస్తెసిస్' సంభాషణ పరికరాన్ని ఆవిష్కరించారు. కేవలం యాభై రూపాయలకే అందే ఈ పరికరం వెలకట్టలేని ఆవిష్కరణ.

వన్ డాలర్ వండర్

గుట్కాలు, పాన్, పొగాకు వ్యసనాలతో గొంతు క్యాన్సర్ల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకు ఎక్కువవుతోంది. ఆలోచించాల్సిన విషయమేమంటే వీరిలో చాలా మంది పేద, మధ్య తరగతి వర్గాల వారే ఎక్కువగా ఉంటారు. వేలాది రూపాయలయ్యే వాయిస్ ప్రొస్తెసిస్‌ల బదులు మందులకు డబ్బు మిగుల్చుకునేవాళ్ళు చాలామందే ఉంటారు. మాట్లాడే అవకాశం కోల్పోతారు. వ్యాధి పీడకు ఇది అదనపు బాధను జత చేస్తుంది. రోగులు మరింత కుంగుబాటుకు లోనవుతారు. ఇది కేవలం శారీరక సమస్యే కాదు. రోగుల మానసిక, కుటుంబ, సామాజిక జీవన సమస్య కూడా. వీరి అవస్థలు ప్రముఖ వైద్యులు అంకాలజిస్ట్ డాక్టర్ విశాల్ రావ్‌ను కదిలించాయి. బెంగళూర్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న ఆయన ఓ వైపు వైద్యం అందిస్తూనే మరో వైపు ప్రయోగాలు మొదలెట్టారు. రెండేళ్ల ఆయన ప్రయత్నం సఫలమై కేవలం 50 రూపాయలకే లభ్యమయ్యే వాయిస్ ప్రొస్తెసిస్ రూపొందింది. కేవలం 25 గ్రాముల బరువుండే ఈ పరికరాన్ని గొంతుకు అమర్చడం చాలా తేలిక. రోగికి ఇబ్బంది చాలా తక్కువగా ఉంటుంది. డాక్టర్ రావ్ ఆవిష్కరణతో ఇప్పుడు చాలా మంది తమ కుటుంబ సభ్యులతో తిరిగి మాట్లాడగలుగుతున్నారు. బయట మార్కెట్‌లో 20 వేల రూపాయల వరకు వాయిస్ ప్రొస్తెసిస్‌లు దొరుకుతాయి. అనుకున్న ధరకు మార్కెట్‌లోకి తెచ్చేందుకు తన స్నేహితుడు, పారిశ్రామిక వేత్త శశాంక్ మహేష్ సహకారం తీసుకున్నారు డాక్టర్ రావ్. గతేడాది చివరలో వెలుగులోకి వచ్చిన ఈ ఆవిష్కరణ వన్ డాలర్ వాయిస్ బాక్స్‌గా సంచలనం సృష్టించింది. శస్త్రచికిత్సల్లో ఒక్కోసారి స్వరపేటికను తొలగించాల్సి ఉంటుంది. ఆ సందర్భంలో వాయు నాళాన్ని, ఆహార నాళాన్ని విడదీస్తారు. ఆ రెంటి మధ్యలో ఉన్న ప్రాంతంలో డాక్టర్ రావ్ అభివృద్ధి చేసిన కేవలం



డా॥ విశాల్ రావ్

2.5 సెం.మీ.లుండే ఈ వాయిస్ ప్రొస్తెసిస్‌ను గొంతుకు చేసిన చిన్న రంధ్రం ద్వారా అమర్చుతారు. శ్వాస తీసుకునే సందర్భంలో ఊపిరి తిత్తుల కదలికలకు పరికరం వైబ్రేట్ అవుతుంది. స్వర పేటికలో స్పందనలు బదులు ఆహార నాళం వల్ల పరికరం వెనుక భాగం వైబ్రేట్ అవుతుంది. ఈ స్పందనల ద్వారా శబ్దం వెలువడుతుంది. ఆ శబ్దాల్లోని బేధాల్ని మెదడు అర్థం చేసుకుని క్రమంగా మాటల రూపంలోకి తెచ్చే సిగ్నల్స్‌ను విడుదల చేయగలుగుతుంది. నీరు, ఆహారం ఊపిరితిత్తుల్లోకి చేరకుండా వన్-వే వాల్వ్ వ్యవస్థలా పరికరం పనిచేయడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేనట్టే.

జర్మనీ నుంచి ప్రత్యేకంగా తెప్పించుకున్న ప్లాటినమ్ క్యూర్డ్ సిలికోన్ పదార్థాన్ని వాడి పరికరాన్ని రూపొందించారు. ఇది రెండు రెట్ల దృఢత్వంతో పాటు మూస పోసేందుకు సులువుగా ఉంటుంది. ఇది కణజాలంతో ఎటువంటి రియాక్షన్ ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పీన్యాకు చెందిన 55 ఏళ్ల రామకృష్ణ అనే వాచ్‌మెన్ ఒకరికి తొలిసారిగా ఈ వాయిస్ ప్రొస్తెసిస్‌ను అమర్చారు. అది అద్భుతమైన ఫలితాల్ని అందించింది. ఆయనకు శస్త్ర చికిత్స చేసి స్వరపేటికను తీసేశారు. విదేశాలకు చెందిన వాయిస్ బాక్స్‌ను వేశారు. కానీ దాని జీవిత కాలం కేవలం 6 నెలలే. తర్వాత మళ్లీ చిన్న శస్త్ర చికిత్స ద్వారా మరో వాయిస్ బాక్స్ వేయాలి. ఇదంతా ఖర్చు, ప్రయాస, బాధలతో కూడుకున్న వ్యవహారం. 6 నెలలకోసారి మార్చుకోలేక పాత దాన్నే రెండేళ్ల పాటు వాడాడు రామకృష్ణ. అది పాడై ఆహారం దాని గుండా బయటకు లీకయ్యేది. ఈ బాధల్ని ఇక భరించలేక డాక్టర్ రావ్‌ను రామకృష్ణ కలిశాడు. అప్పుడే అతడు పరిశోధిస్తున్న ప్రొస్తెసిస్ పని పూర్తయ్యింది. తొలి పరికరాన్ని పరీక్షించేందుకు డాక్టర్ రావ్ రామకృష్ణనే ఎంచుకున్నారు. యాభై రూపాయలకు దాన్ని అందించారు. ఐదే నిమిషాల్లో అమర్చగలిగిన దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు నెలల తర్వాత కూడా తలెత్తలేదు. ఆ తర్వాత మరో ఇద్దరికీ దీన్ని వేసి పరీక్షించారు. ఇక పూర్తిగా మార్కెట్‌లోకి తెచ్చే యత్నాల్లో ఉన్నారు శశాంక్. కేవలం పేదలైనంత మాత్రాన వారు మాట్లాడే హక్కును కోల్పోవాలా అనే ప్రశ్న 37 ఏళ్ల డాక్టర్ రావ్‌ది. వాడేసిన బట్టల్ని పదిమందికి పంచే సేవ కన్నా పేదలకు గౌరవాన్ని ఇస్తూ చేసే వినూత్న వైద్య ఆవిష్కరణల సేవకే తన శక్తిని ఖర్చు చేస్తారంటారాయన. అనేక అంతర్జాతీయ సంస్థలతో చేయి కలిపి పల్లెల్లో తిరుగుతూ క్యాన్సర్ అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వ్యసనాల నుంచి గ్రామీణుల్ని దూరం చేసేందుకు కృషి చేస్తున్నారు. క్యాన్సర్ మహమ్మారిని జయించే ఓ 'మ్యాజిక్ బుల్లెట్' మందు తయారీకి కూడా ఆయన బృందం పరిశోధిస్తోంది. ఆవిష్కరణలో చివరి అంకానికి చేరుకున్నారు. ఇదే గనుక అందుబాటులోకి వస్తే దాదాపు 80 శాతం క్యాన్సర్ రోగాలకు ఓ పిల్ ద్వారా చెక్ పెట్టొచ్చు. కానీ వైద్య పరిశ్రమలోని కొన్ని వర్గాలు లాబీగా ఏర్పడి తక్కువ ఖర్చుకే క్యాన్సర్ వైద్యం అందే అవకాశాన్ని అడ్డుకునే పథకాల్ని రచిస్తున్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు. జాన్‌హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ పరిశోధకుడి కృషి ఇలానే అటకెక్కిందని అంటారు. డాక్టర్ రావ్ ఈ విషయంలో జాగ్రత్తగా ఉంటున్నారు.

ENTERED

కథా నిలయం
శ్రీకాకుళం

ఇండెక్స్

విజేత................3

పంచ మహా సముద్రాల జలకన్య

స్టార్.............. 4

పాత్రే ప్రాణం...

కార్టూన్ పంచ్......... 5

వింతలోకం...................10

ఖరీదైన సమాధి వీధి...

జీవితం..............11

జీపీఎస్‌కు స్వరం

కవిత్వమ్...............14

నీకు జాలి మాటలొద్దు..

మన మహిళా ముఖ్యమంత్రులు

అట్టమీది కథ.........6

సందర్భం - 12

ప్రపంచం నర్తిస్తే..

తెలుసా.....................15

ఈ ప్రాణాలకు లెక్కేది?

నా కళ్ళతో...............16

మూవీల్లోకి ప్రయాణం

కథ..............18

దెయ్యం

రుచి.....................21

పుచ్చకాయ-బొప్పాయి సలాడ్

బాల నేస్తాలు..............22

మంచు చేపలు

పద వికాసం..............24

వీర వనిత 'లోబో'

సిరియాలో లక్షల మంది చిన్నారుల దుర్భర జీవితాలను కళ్ల ముందుంచిన చిత్రాలు, వివరాలు మనస్సును చలింపజేశాయి. చైనాలో బంగారు ఛాయలో మెరిసిపోతున్న అతివిశాల మైన పూదోటల మైదానం వింత అనుభూతిని కలిగించింది. హిట్లర్, సిల్వెస్టర్ తదితరుల తొలి రోజుల్లోని వారి అనుభవాలు ఆశ్చర్యపరిచాయి. ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న సినిమాలు దరిమిలా వివరంగా రావడం సంతోషం. వాటిని విశ్లేషించిన కొత్త ఊపిరి సమీక్షా కథనం ఆసక్తిని రేకెత్తించింది. గోవా లిబరేషన్ కోసం ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపిన లిబియా 'లోబో' నిజమైన దేశభక్తురాలు.

-టి.సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

సేవాతత్పరత

గ్రామాల్లో వైద్య సేవలందించడానికి డాక్టర్లు వెనుకాడుతున్న ఈ రోజుల్లో అంగవైకల్యాన్ని కూడా లెక్కచేయకుండా టిజుహాంగ్ పల్లెల్లో వైద్య సేవలందించడం అభినందనీయం. స్టూల్ సాయంతో ప్రతిచోటికీ చేరుకుని వైద్యాన్ని అందించడం ఆమె సేవాతత్పరతకి నిదర్శనం. తాత, నానమ్మలు పాత జ్ఞాపకాలుగా దాచుకున్న ఫొటోల్లోని అందమైన ప్రదేశాలను మళ్లీ

వారి ఫోటోలతోనే చుట్టొచ్చిన మనవడి ఫోటో జర్నీ, జావెలిన్‌తో జయించాడు ఆద్యంతం చదివించాయి. కార్టూన్ పంచ్, నవ్వుల్ పువ్వుల్, ఐస్‌క్రీమ్ రెసిపీలు బాగున్నాయి. సిరియా యుద్ధ పరిస్థితుల్లో శరణార్థులుగా మారినవారు కొందరు, ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు మరికొందరు. వేల సంఖ్యలో మృతిచెందిన చిన్నారులను చూసి మనసు కకావికలమైంది.

-నళిని, అనంతపురం

స్వేచ్ఛా స్వరం

ఉద్యమాలను నడపడం ఎంతో సాహసోపేతమైన పని. ఎప్పటికప్పుడు తమ మాటలతో, సత్ప్రవర్తనతో అందర్నీ చైతన్య పరిచే ఉద్యమకారుల్లా తాను పనిచేస్తున్న రేడియోనే ఓ ఆయుధంగా మార్చుకుని ఉద్యమానికి తన స్వేచ్ఛా స్వరంతో ఊపిరిపోసిన లిబియా ఓ వీర వనిత. ఎత్తైన ప్రదేశాలను వీక్షించడం ఆనందాన్ని కలిగిస్తుంది అయితే ఆకాశంలో హైజంప్ చేయమంటే ఎక్కడలేని భయం ముంచుకొస్తుంది. ప్రాణాలను లెక్క చేయకుండా తెగువతో పక్షుల్లా ఎగిరే స్కై డైవర్, భారత్‌లో స్కై డైవింగ్‌కి అనువైన ప్రదేశాలను గురించిన విశేషాలు ఆద్యంతం చదివించాయి. బంగారు వనాన్ని తలపించే ఆవాల తోటల మధ్య నుండి పడవ ప్రయాణం పసిడికాంతులను పరుచుకున్న తోటలు మనసును హత్తుకున్నాయి.

- రామ్మోహన్, రాజమహేంద్రవరం

తొలినాళ్లలో...

ప్రపంచ నియంతలుగా మారిన హిట్లర్, ముస్సోలినీ వంటి వారితో పాటు సిల్వెస్టర్, విన్‌ఫ్రే వంటి వారు తొలినాళ్లలోని జీవిత పయనాల విశేషాలు కళ్లుచెమర్చాయి. ఇరవై ఏళ్ల క్రితంనాటి పాప్ సాంగ్స్‌లో తెరంగేట్రం చేసిన నటీమణుల పరిచయం, కొంకణ్ స్వేచ్ఛా స్వరం, కొత్త ఊపిరి, జావెలిన్‌తో జయించాడు ఆద్యంతం చదివించాయి. పక్షులు, జంతువుల చిట్టి బుర్రలో ఏముందో తెలిపిన తెలుసాలోని విషయాలు వింతగొలిపాయి. విషవలయం, కార్టూన్‌పంచ్, నవ్వుల్ పువ్వుల్, మనవడి ఫోటో జర్నీ అకట్టుకున్నాయి. నినాద నాదం, కల నిజమవ్వాలంటే నేటి తరాన్ని ఆలోజింపచేసే కవితలు.

-వైష్ణవి, తెనాలి.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఐదు మహా సముద్రాల్ని జయించింది భక్తి శర్మ. సముద్ర జలాల గజ ఈతలో ఆమెను జయించడం కష్టమే. ఆమె వికసించిందే సరస్సుల నగరం ఉదయ్‌పూర్‌లో. అందుకే నీటికీ భక్తికి అనుబంధం ఎక్కువ. సాహసోపేతమైన ఓపెన్ వాటర్స్ స్విమ్మర్‌గా రికార్డుల మీద రికార్డులను ఈ యువ సాహస యువతి సొంతం చేసుకుంటోంది.

పంచ మహా సముద్రాల జలకన్య

ఓపెన్ వాటర్స్ పోటీలు ఎంత అసాధ్యంగా ఉంటాయంటే గంటల తరబడి ఈదినా క్రీడాకారులు మాత్రం ఆసరాకు ఎవరి చేయి పట్టుకోగూడదు. రక్షణకు వస్తున్న పడవను తాకకూడదు. ఈతలో చిన్న చిన్న విరామాలు తీసుకుంటూ తాగునీరు, ఆహారం తీసుకోవాలి. అలాంటి వాటికి ఇక ప్రకృతి అడ్డంకులు అదనం. ఎప్పుడు జలప్రవాహం ఎలా ఉంటుందో, అలల తాకిడి ఎదురవుతుందో ఊహించడం కష్టం. ఇక శీతల గాలులు, జలాలు సమస్యను పెద్దది చేసి పెద్ద పరీక్ష పెడతాయి. గతేడాది జనవరి10న భక్తి అంటార్కిటికా మంచు జలాల్లో ఈది అందరినీ అవాక్కయ్యేలా చేసింది. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డును కూడా సొంతం చేసుకుంది. శరీరం బిగుసుకుపోయేంత చలిగా ఉండే అంటార్కిటికా జలాల్లో 52 నిమిషాల పాటు 2.28 కి.మీ. దూరం ఈత కొట్టి శభాష్ అనిపించుకుంది. మొత్తం ఐదు మహా సముద్రాల టార్గెట్‌ను పూర్తిచేసుకుని జలకన్య అనే పేరు కూడా తెచ్చుకుంది. రెండేళ్ల వయస్సుకే స్విమ్మింగ్ పూల్‌లో జలకాలాటలు చేసిన భక్తికి ఇక జీవితమంతా అదే ఆట అయ్యింది. భక్తి తల్లి లీనా కూడా స్విమ్మరే. ఆమె ప్రోత్సాహంతోనే చిన్ననాటి నుంచే అనేక ఈత పోటీల్లో భక్తి పాల్గొంది. కానీ స్విమ్మింగ్ పూల్ అంటే బోర్ కొట్టేసింది. ఈ ఓపెన్ వాటర్స్ పోటీలకు సిద్ధమవ్వాలని పాఠశాల రోజుల్లోనే నిర్ణయం తీసుకుంది. జుహూ బీచ్‌లో ఓ జాలరి పడవలో ఆమె కొంత దూరం సముద్రంలోకి చేరుకుని ఈతను అభ్యసించేది. మధ్యాహ్నం 1 గం. కు మొదలెడితే తిరిగి పడవలోకి చేరేది సాయంత్రం నాలుగు గంటలకు. అంత కఠినంగా శిక్షణ తీసుకుంది. ఆమెకు 14 ఏళ్లప్పుడు తొలిసారిగా.. ముంబై తీరంలో యురాన్ పోర్ట్ నుంచి ఇండియా గేట్ వే వరకు 16 కి.మీ. దూరం ఈది ఆశ్చర్యపరిచింది. అదే ప్రేరణగా అనేక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకుంది. 16వ ఏట ఆమె చూపు అంతర్జాతీయ జలాలపై పడింది. వార్తల్లో తరచూ వినిపించే ఇంగ్లిష్ చానల్ జలాలు ఆమెకు నిద్రను దూరం చేశాయి. క్లిష్టతరమైన ఆ జలాల్లో ఈత అంత ఆషామాషి వ్యవహారం కాదు. పర్వతారోహణలో ఎవరెస్ట్ శిఖరం లాంటిది ఓపెన్ వాటర్స్ పోటీల్లో ఇంగ్లిష్ చానల్. జల ప్రవాహానికి ఎదురీత చాలా కష్టం. ఎంత సేపు కాళ్లాడించినా తిరిగి డ్రిఫ్ట్ అయ్యి అక్కడే ఉంటారు. అంత బలంగా ఉంటుందా ప్రవాహ తీరు. అందులో ఈతంటే అదో సాహసం. దీని కోసం రెండేళ్లు శిక్షణ చివరకు పొందింది. 90 నిమిషాల ప్రయాస తర్వాత దాని అంతు చూసింది భక్తి. ఆ తర్వాత తన తల్లితో కలిసి మరోసారి ఈదేసింది. తల్లీకూతుళ్లు కలసి ఇంగ్లీష్ చానల్‌ను ఛేదించిన రికార్డు వారిదే. అదెంత గొప్ప అనుభూతుల్ని మిగిల్చిందంటే ఆ సాహస విజయాన్ని వేడుక చేస్తూ ఆమె చదువుతున్న కళాశాల ఆ రోజు సెలవు ప్రకటించింది. ఇంత కంటే గొప్ప రోజు ఏముంటుంది విద్యార్థి జీవితంలో. చదువుల్లో కూడా టాపర్‌గా నిలిచి మాస్టార్ల దగ్గర మరింత స్కోర్ పెంచేసుకుందిలెండి. భక్తికి ముందు బులా చౌదరీ అనే మహిళ సప్త సముద్రాల్లో ఈదింది. ఆమే భక్తికి ప్రేరణ. అయితే భక్తి మరింత కష్టసాధ్యమైన మహాసముద్రాలను ఎంచుకుంది. హిందూ మహా సముద్రం తర్వాత 2007 అమెరికా పర్యటనలో పసిఫిక్, అట్లాంటిక్ మహా సాగరాల్లో సాహసాల్ని చేసింది. సాన్‌ఫ్రాన్సిస్కో తీరం వద్ద పసిఫిక్‌ను, గల్ఫ్ మెక్సికోలో అట్లాంటిక్ జలాల్లో ఓలలాడింది. ఇవన్నీ కొద్దో గొప్పో చలి తక్కువగా ఉండేవే కానీ అసలు సవాల్ ఆర్కిటిక్, అంటార్కిటికా మహా సముద్ర జలాల ద్వారా ఎదురైంది. ఆర్కిటిక్‌లో ఫీట్ కోసం తన స్విమ్ స్యూట్‌లో మంచు గడ్డల్ని వేసుకుని ప్రాక్టీస్ చేసింది. కానీ సముద్ర జలాల శీతల ప్రభావం లెక్కే వేరు. ఆ విషయం తొలిసారి ఆర్కిటిక్ జలాల్ని తాకినపుడు తెలిసిందామెకు. వేళ్లలో రక్త సరఫరా స్తంభించి స్పర్శను క్షణాల్లో కోల్పోయింది. వేళ్లు తెగిపోయాయోమోనన్న భావన కలిగిందట. కానీ వెనకడుగు వేయకుండా 1.8 కి.మీ. దూరాన్ని 33 నిమిషాల్లో ఈదేసింది భక్తి. ఇలా నాలుగు మహా సముద్రాల్ని ఈదిన రెండో వ్యక్తిగాను, అతి పిన్న వయస్కురాలిగా రెండు ఘనతల్ని సాధించింది. తర్వాత తన ఆరాధ్య గజ ఈతగాడు. చివరి టార్గెట్ అయిన అంటార్కిటికా కోసం ఓ స్విమ్మింగ్ పూల్‌లో 10 టన్నుల మంచు గడ్డల్ని వేసుకుని ప్రాక్టీస్ చేసింది భక్తి. మంచు ఫలకాలు, పెంగ్విన్లతో ముచ్చటగొలిపే గొప్ప ల్యాండ్‌స్కేప్‌లతో నిండిన పీటర్‌మాన్ ద్వీపం వద్ద అంటార్కిటికా జల్లాలోకి దూకింది. ఎవరూ ఊహించని విధంగా 2.28 కి.మీ.ల దూరం ఈదులాడి తన జీవిత లక్ష్యాన్ని సాధించింది. భక్తి తిమింగలాలు, జెల్లీ ఫిష్‌లు, డాల్ఫిన్లు, సీ లయన్స్ ఆవాసాల్లో ఈత కొట్టింది. స్పెయిన్‌లోని టారిఫా తీరంలో సొర చేపల ప్రమాదం ఎక్కువ. అక్కడ కూడా ఈదులాడి తన తెగువ ప్రదర్శించింది. ప్రస్తుతం 2020లో నిర్వహించనున్న ఒలంపిక్స్‌లో 5, 10 కి.మీ. పోటీల్లో పాల్గొనేందుకు కసరత్తు చేస్తోంది. ఒక ఏడాది ముందే వచ్చే 2019 వరల్డ్ చాంపియన్‌స్షిప్‌లో సత్తా చాటాలి. ఇంత బిజీలోను ఆమె 'క్రీడల్లో మానసిక శిక్షణ' అనే విషయంపై పీహెచ్‌డీ చేసేందుకు సమయం కేటాయించుకుంది. ✦



నటనంటే పిచ్చిగా అభిమానించే వాళ్లను చూశాం. ఇంకా చూస్తే ప్రేమించేవాళ్లనూ చూస్తాం. రణదీప్ హూడా అయితే ప్రాణమిచ్చేస్తారు. అదెలా అంటే... ప్రాణమెక్కువా? పాత్రెక్కువా? అని అడిగితే రెండో దానికే ఈయనోటేస్తారు. ఆయనేదైనా పాత్ర చేయాలంటే అది ఆయనే చేయగలడు అనేలా ఉండాలి. అందులో ఆయన నటన చూశాక ఇక ఆ రోల్‌లో మరొకరిని ఊహించలేరు. ఇంత ప్రొఫెషనలిస్ట్, పర్ఫెక్షనిస్ట్ బ్యాక్‌గ్రౌండ్, కుటుంబం సినీ ప్రముఖులై ఉంటారనుకుంటే పొరపాటే. ఒకప్పుడు పరాయి దేశంలో ట్యాక్సీ డ్రైవర్‌గా, కార్లు శుభ్రం చేసే వ్యక్తిగా ఉద్యోగం చేశారు. ఇప్పుడు బాలీవుడ్‌లో విభిన్న పాత్రలు చేస్తూ రాణిస్తున్నారు.

పాత్రే ప్రాణం...

- రణదీప్ హూడా ఆగస్టు 20, 1976లో హర్యానాలోని రోహ్‌తక్‌లో జన్మించారు. రణబీర్ హూడా, ఆశా హూడా తల్లిదండ్రులు.
- బాల్యమంతా తల్లిదండ్రులకు దూరంగా గడిచింది. వారి ప్రేమకు నోచుకోలేదని ఇప్పటికీ బాధపడుతూ ఉంటారు. వారు ద్రోహం చేశారని అంటారు.
- అమ్మమ్మ సంరక్షణలోనే పెరిగారు. ఆమె తనను క్రమశిక్షణతో పెంచిందట. ఆవిడ చాలా కఠినంగా ఉండేదని, పెంపకం ఓ అద్భుతమని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.
- పాఠశాల చదువంతా అస్తవ్యస్తంగా సాగినా ఉన్నత విద్యను మాత్రం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పూర్తి చేశారు.
- బిజినెస్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్సెస్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన హూడా ఆస్ట్రేలియాలో చాలా ఉద్యోగాలు చేశారు. వెయిటర్‌గా, కార్లు వాష్ చేసే ఉద్యోగం, టాక్సీ డ్రైవర్‌గా కూడా పనిచేశారు.
- భారత్ వచ్చి మోడల్‌గా కెరీర్ ప్రారంభించి 2001లో 'మాన్‌సూన్ వెడ్డింగ్' చిత్రంలో చిత్రసీమలోకి అడుగుపెట్టారు. తర్వాత నాలుగేళ్ల పాటు అవకాశాలు లేవు. 2005లో రామ్‌గోపాల్ వర్మ చిత్రం 'డి'లో చేశారు. తర్వాత అవకాశాలు ఎక్కువగానే వచ్చాయి.
- కన్వెన్షన్స్‌కు దూరంగా ఉండే విభిన్న పాత్రలెన్నో అతడి నటనా సామర్థ్యాన్ని నిరూపిస్తాయి. హైవే చిత్రంలో కిడ్నాపర్‌గా, జిస్మ్-2లో మాఫియా గ్యాంగ్ మెంబర్‌గా, కిక్ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా ఆ పాత్రల్ని సజీవం చేశాడు.
- బాలీవుడ్‌లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన హూడా ఏ పాత్ర చేసినా ముందుగా ఆ పాత్ర ప్రవర్తన ఎలా ఉంటుందో జాగ్రత్తగా గమనిస్తాడు. అవసరమైతే సంబంధిత వ్యక్తులను దగ్గరగా పరిశీలిస్తాడు. ఆ పాత్రకు సంబంధించిన పుస్తకాలు ఉంటే చదువుతాడు.
- ఇప్పుడు 'సరబ్‌జిత్' చిత్రం ద్వారా పాకిస్తాన్ జైల్లో మగ్గి తుది శ్వాస విడిచిన భారతీయ ఖైదీ సరబ్‌జిత్ కష్టాల్ని కళ్లకు కట్టే పాత్ర కోసం హూడా శారీరకంగా, మానసికంగా అలాంటి పరిస్థితుల్లో నటనను ప్రాక్టీస్ చేశాడు. పాత్ర కోసం ఏకంగా 20 కేజీలు తగ్గిపోయాడు. ఈ సినిమాలో ఆయన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విడుదలైనప్పుడు నిజంగా ఈయనేనా అనుకున్నారు.
- ఇటీవల 'సుల్తాన్' సినిమా షెడ్యూల్ దెబ్బతింటుందనే భావనతో తనకు అపెండిసైటిస్ నొప్పి వచ్చినా బయటకు కనబడకుండా ఉండేందుకు పెయిన్ కిల్లర్స్ వాడాడు. 15రోజుల షెడ్యూల్‌లో ఇదే పద్ధతిని అనుసరించాడు. చివరకు పరిస్థితి విషమించి ఆస్పత్రికి చేర్చాల్సి వచ్చింది. అప్పటికప్పుడే సర్జరీ చేశారు. ఈ చిత్రంలో ఈయన సల్మాన్‌కు కోచ్‌గా కన్పిస్తాడు.
- ప్రతి ఒక్కరూ చిత్రాల్లో లవర్ బాయ్‌గా కన్పించడానికి ఇష్టపడతారు కానీ ఈయనెప్పుడూ బాలీవుడ్‌లో ఆ పాత్రలో కన్పించాలని అనుకోలేదట, అది అతని లక్ష్యం కూడా కాదని ప్రతి ఇంటర్వ్యూలోనూ చెబుతూ ఉంటారు. గర్ల్ ఫ్రెండ్స్ అన్న పదమే ఇష్టముండదట.
- కొత్తవారిని, ప్రతిభావంతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల్లో 'రణదీప్ ఫిల్మ్ ఫెస్టివల్' పేరిట ఓ కార్యక్రమాన్ని ప్రారంభించాడు. దీని ద్వారా నూతన ఆవిష్కర్తలకు తన సినిమాల్లోను, బాలీవుడ్‌లోను అవకాశాలు కల్పిస్తున్నారు.
- ఈయన చేసిన పాత్రలన్నీ విభిన్నంగా ఉంటాయి. ఏ ఒక్క పాత్ర మరొక దానికి పోలిక ఉండకుండా చేస్తారన్నది బాలీవుడ్‌లో టాక్. అలా అని తన హద్దులను ఎప్పుడూ దాటలేదు. 'బొంబాయి టాకీస్' చిత్రం కొన్ని సన్నివేశాలు స్టార్ ఇమేజ్ పక్కన పెట్టి చేసినవే.
- రవి వర్మ జీవిత కథగా తెరకెక్కిన 'రంగ్ రసియా' చిత్రంలో ఆ పాత్ర పోషించిన హూడా గుర్రపు స్వారీతో అందరి ప్రశంసలు పొందారు. ఆయనకు గుర్రాలంటే పిచ్చి.
- గుర్రాల పెంపకమన్నా, హార్స్ రైడింగ్ అన్నా చాలా ఇష్టం. ఆరు గుర్రాలను పెంచుతున్నారు. ఇండియన్ ఆర్మీ బలగాలు ఢిల్లీ, ముంబైల్లో రైడ్ నిర్వహించినప్పుడు హూడా కూడా పాల్గొన్నారు. అప్పుడు రెండు పతకాలను కూడా గెలుచుకున్నారు.

-కొప్పుసెట్టి దేవరాజు



కార్టూన్ పంచ్



ఫిట్స్



అమ్మ: బాబు ఇలా రా..రా..!పక్కింటి అమ్మాయికి ఫిట్స్ వచ్చినట్టుంది.. ముఖం ఓ వైపు తిరిగిపోయింది. నోరు పెదాలూ సొట్టబోయాయి. నాలుక బయటకి వచ్చేసింది.. త్వరగా రారా..

కొడుకు: అయ్యో అమ్మా! అవి ఫిట్స్ కాదు, ఆ అమ్మాయి సెల్ఫీ తీసుకుంటోంది

లవ్ లెటర్

పిసినారి సుబ్బారావు నీకు ప్రేమలేక రాశాడట కదా..? స్నేహితురాల్ని అడిగింది జానకి

"ఆ.. రాశాడు లేవే..! లెటర్ చివర్న నువ్వు నన్ను ప్రేమించకపోతే, ఈ లెటర్ మీ చెల్లికి ఇవ్వగలవు అని రాశాడే..! అంటూ నవ్వుతూ చెప్పింది శ్యామల.

దోమలు



సూది పొడిచినా కిక్కురుమనటం లేదేమిటోయ్? ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్.

"ఎలా అనమంటారు సార్! ఇంతకన్న ఎక్కువగా వార్డులోని దోమలు కుడుతుంటే..' బాధగా చెప్పాడు పేషెంట్.

జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రిగా మెహబూబా ముఫ్తీ ప్రమాణ స్వీకారాన్ని టీవీల్లో చూసి చాలా మంది మహిళలు సంతోషించి వుంటారు. ఆ మరుక్షణమే 'ఈమెతో కలిపి మొత్తం ఐదుగురు ఆడవాళ్లు ముఖ్యమంత్రులుగా వున్నారు. ఎంత మంచి రోజిది' అనుకుని వుంటారు. పార్టీలకు, ప్రణాళికలకు అతీతంగా ఆలోచిస్తే ఆ క్షణం నిజంగా ఆనందించదగినది. పంచుకోదగినది. ఒక్కసారి వెనక్కి మళ్లి చరిత్రలోకి వెళితే ఇలాంటి అరుదైన సందర్భాలు అతి తక్కువగా కనిపిస్తాయి. మన పురుషాధిక్య సమాజంలో ఇప్పటికి కేవలం 16 మంది మహిళలు మాత్రమే సీఎం పీఠాన్ని అధిష్టించగలిగారు. తమ చుట్టూ వున్న వివక్షలు, ఆధిపత్యాలు, ఆజ్ఞలను అధిగమించి అక్కడికి చేరుకోవడం చిన్న విషయం కాదు.



మన మహిళా ముఖ్యమంత్రులు

- అంజన.కె

ఈ పదహారు మందీ ముఖ్యమంత్రులే అయినప్పటికీ...ఎవరి గూడు వారిదే. ఎవరి దారి వారిదే. ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఐదుగురు. ప్రాంతీయ పార్టీల నుంచి వచ్చినవారు ఆరుగురు. మైనారిటీ వర్గం నుంచి వచ్చిన వారు ఇద్దరు. కాషాయ కూటమికి చెందిన వారు నల్గురు. అతి తక్కువ కాలం ముఖ్యమంత్రులుగా మెరిసిన వారు ముగ్గురు.

కాంగ్రెస్ ముఖ్యమంత్రులు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం ఐదుగురు మహిళలు ముఖ్యమంత్రులయ్యారు. దేశంలో తొలి సీఎంగా ఎన్నికైన సుచేతా కృపలానీ మొదలుకొని నందినీ సత్పతి, సయిదా అన్వారా, రాజిందర్ కౌర్ భట్టల్, షీలా క్షిత్ ఆ జాబితాలో వున్నారు. ంగాలీ కుటుంబానికి చెందిన సుచేతా మజుందార్ ంది హర్యానాలో. ఆమె తండ్రి ఎస్.ఎన్. మజుందార్ జాతీయవాది, ప్రభుత్వ వైద్యులు. ఢిల్లీలో చదువుకున్న ఆమె బెనారస్ యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరారు. అప్పుడే ఆమెకు సోషలిస్టు నాయకుడు ఆచార్య కృపలానీతో పరిచయమై పెళ్లికి దారితీసింది. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొనడంతో.... ఆమెను కస్తూర్బా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకురాలిగా నియమించారు గాంధీజీ. నోఖాలిలో మత ఘర్షణలు చెలరేగినప్పుడు గాంధీజీతో పాటుగా అక్కడకు వెళ్లి బాధితులకు సేవలందించారు. అయితే నెహ్రూతో విభేదించిన భర్త 1952లో కాంగ్రెస్ నుంచి బైటకొచ్చి వేరే పార్టీ పెట్టినా ఆమె మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ రెండు ముఠాలుగా (త్రిపాఠి, గుప్తా) చీలినప్పుడు అనివార్య పరిస్థితుల్లో అక్కడికి వెళ్లి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. సాదాసీదాగా వుంటూ, కష్టపడి పనిచేసే ఆమె విలువలకు కట్టుబడి వుండేవారు. ఇప్పటికీ ఉత్తరప్రదేశ్‌ని ఏలిన ఉత్తమ ముఖ్యమంత్రుల్లో ఒకరిగా ఆమెను గుర్తు చేసుకుంటూనే వుంటారు.

నందిని సత్పతి గొప్ప రాజకీయ నాయకురాలే కాదు. మంచి రచయిత కూడా. ఒడిషా తొలి సీఎంగా పనిచేసిన ఆమె తండ్రి కూడా చెయ్యి తిరిగిన రచయిత. ఆమె తాతగారు స్వాతంత్ర్య పోరాట యోధుడు. మామయ్య భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిషా కమ్యూనిస్టు పార్టీ స్థాపకుడు. భర్త దేవేంద్ర సత్పతి రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఇలా కుటుంబంలో ఎటు నుంచి చూసినా రాజకీయ వాసనలే. బాల్యం నుంచీ రాజకీయ నాయకులు, రచయితల సాంగత్యం లభించింది. విపరీతంగా పెరిగిన కళాశాల విద్య ఖర్చుకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. అగ్రభాగాన నడిచిన ఆమె పోలీసు లాఠీ దెబ్బలు తినడమే కాక, ఆ తర్వాత జైలు శిక్షను కూడా అనుభవించారు. 1972లో సీఎంగా ఎన్నికై నాలుగేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించారు. వీటికితోడు ఆమెలో చక్కటి రచయిత, అనువాదకురాలు కూడా వున్నారు. ఒరియాలో మంచి రచనలు చేశారు. అవి పలు ఇతర భాషల్లోకి తర్జుమా కూడా అయ్యాయి. ఒరియా సాహిత్యానికి చేసిన సేవకు గాను ఆమెకు సాహిత్య భారతి సమ్మాన్ అవార్డు వరించింది. తస్లీమా నస్రీన్ 'లజ్జ'ను

ఒరియాలోకి అనువదించే అరుదైన అవకాశాన్ని కూడా ఆవిడ అందిపుచ్చుకున్నారు.

పంజాబ్‌లో తొలిసారి సీఎం కుర్చీ ఎక్కిన మహిళ రాజిందర్ కౌర్ భట్టల్. 1994లో భట్టల్ చండీగఢ్ విద్యాశాఖా మంత్రిగా చేశారు. హర్ చరణ్ సింగ్ బ్రార్ రాజీనామా అనంతరం 1996లో ఆమె ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. పని చేసింది కొద్ది కాలమే అయినా చిన్నసన్నకారు రైతులకు ఉచిత విద్యుత్ అందించే కృషి చేశారు. ఆ మరుసటి సంవత్సరం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పరాజయం పాలవడంతో కౌర్ సీఎం పదవిని కోల్పోయారు. అనంతరం పంజాబ్ లెజిస్లేచర్ పార్టీ నాయకురాలిగా రెండేళ్లపాటు పనిచేశారు. 2004లో ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. మొత్తం మీద పంజాబ్ రాజకీయాల్లో ఆమె ప్రభావం రేఖామాత్రంగా కనిపిస్తుంది.

భారత రాజకీయాల్లో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న నేత షీలా దీక్షిత్. 1998 నుంచి మూడు సార్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. అత్యధిక రోజులపాటు సీఎం బాధ్యతలు నెరవేర్చిన మహిళగానూ ఆమెది రికార్డే. అయితే షీలా రాజకీయ జీవితం అనుకోకుండా మొదలైంది. ఆమె మామగారైన ఉమాశంకర్ దీక్షిత్ స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర మంత్రి. ఆయన పనుల్లో సాయపడే వారు షీలా. అలా ఆమె శక్తిసామర్థ్యాలను గమనించిన ఇందిర ... మహిళా స్థితిగతులపై ఏర్పడిన 'యునైటెడ్ నేషన్స్ కమిషన్' భారత ప్రతినిధిగా షీలాను నియమించారు. అక్కడి నుంచి ఢిల్లీ సీఎంగా తేలారు. వరుసగా ముమ్మార్లు ముఖ్యమంత్రిగా చేసి తన పాలనా దక్షతను నిరూపించుకున్నారు.

ప్రాంతీయ పార్టీలు అందించిన ముఖ్యమంత్రులు

జాతీయ పార్టీలను, వాటి పాలనను ప్రశ్నించి, ఎదిరించి, నిలదీసేవి ప్రాంతీయ పార్టీలే. ఆయా పార్టీ ప్రతినిధులుగా రాష్ట్రాలను ఏలిన మహిళలు బహుకొద్ది మంది. వారు వరుసగా శశికళ కకోద్కర్, జానకి రామచంద్రన్, జయలలిత, మాయావతి, రబ్రీదేవి, మమతా బెనర్జీ. శశికళ గోవాలోని 'మహారాష్ట్రవాది గోమాంతక్ పార్టీ'కి చెందిన ప్రముఖ నేత. ఆమె గోవా తొలి ముఖ్యమంత్రి దయానంద్ బండోద్కర్ కుమార్తె. తండ్రి తదనంతరం ఆమె 1973–79 వరకు సీఎంగా వున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 15 స్థానాలను గెల్చుకోగలిగింది. 1990ల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ... ఆ పార్టీ నుంచి చీలిక గ్రూపుతో ఏర్పాటు చేసిన పి.డి.ఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) మద్దతుతో ఎం.జి.పి తిరిగి స్వల్పకాలంపాటు అధికారంలో కొనసాగింది. ఈ పరిణామాలన్నిటా శశికళా కకోద్కర్ పాత్ర చెప్పుకోదగినది.

దేశంలో ఐదుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన



ఘనత జయలలితది. సినీ రంగం నుంచి వచ్చి సీఎం అయిన రెండవ ముఖ్యమంత్రి కూడా ఆమే. అనుచరులు ఆమెను 'అమ్మ' అని, 'పురచ్చితలైవి' (విప్లవ నాయకి) అని పిల్చుకుంటారు. అయితే ఆమె బాల్యం మాత్రం అంత సజావుగా గడవలేదు. పసితనంలోనే తండ్రిని కోల్పోయింది. కుటుంబాన్ని నడిపేందుకు తల్లి సినీ రంగానికి వెళ్లింది. ఇన్ని సమస్యల మధ్య కూడా చిన్నారి జయ చదువులో ముందుండేది. పదవ తరగతిలో వుండగా రాష్ట్ర

రికార్డుల రారాణులు

భారతదేశంలో తొలి మహిళా ముఖ్యమంత్రి
– సుచేతా కృపలానీ (యు.పి)

ఢిల్లీ తొలి ముఖ్యమంత్రి – **సుష్మా స్వరాజ్**

భారతదేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి
– మాయావతి(యు.పి)

తమిళనాట తొలి మహిళా ముఖ్యమంత్రి
– జానకి రామచంద్రన్

వరుసగా మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసిన మహిళ, ఎక్కువ రోజులు రాష్ట్రాన్ని ఏలిన మహిళ
– షీలా దీక్షిత్ (5,484 రోజులు)

ఐదు సార్లు ముఖ్యమంత్రిగా వున్న మహిళ
–జె.జయలలిత(తమిళనాడు)

సినీ రంగం నుంచి సీఎం అయిన తొలి మహిళ
– జానకి రామచంద్రన్

అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసినది
– జానకి రామచంద్రన్ (23 రోజులు)

ముఖ్యమంత్రి అయిన తొలి ముస్లిం మహిళ
– సయిదా అన్వారా తైమూర్

టాపర్‌గా నిల్చి బంగారు పతకాన్ని అందుకుంది. అయితే కుటుంబ కారణాల వల్ల చదువు ఆపేసి సినిమాల్లోనే కొనసాగాల్సి వచ్చింది. తమిళనాడు సీఎంగా చేసిన ఎం.జి.ఆర్‌తో కలిసి 28, ఆంధ్ర ప్రదేశ్ సిఎంగా పని చేసిన ఎన్.టి.ఆర్‌తో 12 సినిమాల్లో నటించింది. మాటతీరు, నాయకత్వ లక్షణాలను పసిగట్టిన ఎం.జి.ఆర్ ఆమెను ఎ.ఐ.ఎ.డి.ఎం.కె ప్రచార కార్యదర్శిగా నియమించారు. ఇక అక్కడి నుంచి ఆ పార్టీ కార్యకలాపాల్లో ప్రధాన పాత్ర పోషించారు జయ. 1984లో తొలిసారిగా రాజ్యసభలోకి అడుగెట్టారు. అయితే అదే సంవత్సరం ఎం.జి.ఆర్ తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో పార్టీ పూర్తి బాధ్యతలను ఆమే నెత్తికెత్తుకున్నారు. ఎం.జి.ఆర్ మరణానంతరం ఆయన వారసురాలిగా తనను తాను ప్రకటించుకొన్న సాహసి. అయితే జానకి రామచంద్రన్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. అప్పుడు పార్టీ రెండు ముఠాలుగా చీలడం .. ఎన్నికల తదనంతరం రెండూ కలిసి... జయకే నాయకత్వ బాధ్యతలు అప్పగించడం జరిగిపోయింది. 1989 ఎన్నికలలో పోటీ చేసి 27 స్థానాలను సంపాదించి ప్రతిపక్ష నేతగా నిల్చారు. అసెంబ్లీ సాక్షిగా జయలలితపై డి.ఎం.కె అనుచరగణం చేసిన దాడి చీకటి ఘటనగా చరిత్రలో మిగిలిపోతుంది. అయితే ఆ మరుసటి ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన జయ తొలిసారిగా సీఎం అయ్యారు. అలా ముఖ్యమంత్రి అయిన అమ్మ ఐదు సార్లు ఆ పీఠాన్ని అధిష్ఠించారు. అయితే ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారన్న ఆరోపణలతో పదవికి దూరమైన (2014) తొలి సీఎంగా ఆమె మీద మచ్చ పడిపోయింది. మరుసటి ఏడాది కర్నాటక హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో తిరిగి గద్దెనెక్కారు. విజయాలు, వివాదాలు సమపాళ్లలో కలిగివున్న



జయలలిత తాజా అసెంబ్లీ ఎన్నికల్లోను పోటీకి దిగుతున్నారు.

తొలి దళిత సీఎంగా మాయావతికి దేశంలో ప్రత్యేక స్థానం వుంది. బి.ఎతో పాటు పలు డిగ్రీలు సంపాదించిన మాయ కొన్నేళ్ల పాటు ఢిల్లీలో టీచర్‌గా చేశారు. అయితే ఆమె వాక్చాతుర్యం, నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులైన బి.ఎస్.పి నేత కాన్షీరామ్ ఆమెను రాజకీయాల వైపు నడిపించారు. ఆమె ఆలోచనలు, మాటల్లోని లౌక్యం చూసి బిఎస్‌పి స్థాపక బృందంలో ఒకరిగా స్థానం కల్పించారు. 1989లో తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 1995లో యు.పి తొలి మహిళా సిఎం అయ్యారు. అలా ఇప్పటికి నాలుగు సార్లు ముఖ్యమంత్రి బాధ్యతలను స్వీకరించిన ఆమె దళిత యువతకు ఒక ఆశాదీపం. స్ఫూర్తి ప్రదాత. అయితే ఆమె పాలనా సమయంలో ప్రశంసలతోపాటు, పలు విమర్శలనూ ఎదుర్కొన్నారు. అవినీతి ఆరోపణలు వుండనే వున్నాయి.

వంటగది నుంచి ఎకాఎకిన శాసనసభలో కాలూని మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన ఘనత రబ్రీదేవిది. బీహార్‌లో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి) నేత లాలూ ప్రసాద్ యాదవ్ భార్యగా మాత్రమే ఆమె అప్పటి వరకు పరిచయం. అవినీతి ఆరోపణలు, కేసుల్లో చిక్కుకొని లాలూ జైలు పాలవడంతో ఆమెను ఒక్కసారిగా సీఎం పదవి వరించింది. గంపెడు సంతానానికి వంట చేసిపెట్టే రబ్రీ జీవితం తటాల్న మారిపోయింది. ఎవరితో ఎలా మెలగాలి? సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? వంటి ప్రాథమిక అంశాలతో మొదలైన శిక్షణ రాష్ట్ర పాలనను వంటబట్టించడం వరకు సాగింది.

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఫైర్ బ్రాండ్ అంటుంటారు. రాష్ట్రంలో 34 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు చిన్న బ్రేక్ ఇచ్చి అధికారాన్ని 'హస్త'గతం చేసుకుంది మమత. అత్యంత సాధారణంగా కన్పించే మమత రాజకీయ జీవితం కాంగ్రెస్‌తో మొదలైంది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆమె అతి పిన్న వయస్కురాలిగా 1984లో పార్లమెంటులో అడుగెట్టారు. పివి నరసింహారావు హయాంలో మానవ వనరుల శాఖామంత్రిగా చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి చీలి తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. 1999లో ఎన్డీయేతో చేతులు కలిపి రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ కూటమి నుంచి వైదొలగి.. ఆ తర్వాత తిరిగి యు.పి.ఎలో చేరి రైల్వే మంత్రి అయ్యారు. అక్కడా ఇమడక.. బైట పడి రాష్ట్ర రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించారు. 2011 అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించి సీఎం అయ్యారు. నూలు చీర, రబ్బరు చెప్పులతో సాదాసీదాగా కనిపించినా దుందుడుకు స్వభావానికి పెట్టింది పేరు. అనుచరగణం సైతం ఆమెకు తీసిపోదు. భయోత్పాతాన్ని సృష్టించడంలో ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను ఇబ్బందుల పాలు చేయడంలో వారికి వారే సాటి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో వున్నారు. మరి మమత భవిత ఏంటో చూడాలి!

కొంత కాలమ్ సీయమ్

అత్యంత తక్కువ కాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ముగ్గురిని చెప్పుకోవచ్చు. జానకి రామచంద్రన్, సైదా అన్వారా తైమూర్, సుష్మా స్వరాజ్. కేవలం 23 రోజుల పాటు ముఖ్యమంత్రిగా చేశారు జానకి రామచంద్రన్. తమిళ చిత్రం రంగం నుంచి సీఎం అయిన తొలి నటి కూడా ఈమే. ఎం.జి.ఆర్ భార్యగా...ఆయన మరణానంతరం గద్దెనెక్కినా... ఆ తర్వాత రాణించలేకపోయారు. ఎ.ఐ.ఎ.డి.ఎం.కె కార్యకర్తలు సైతం ఆమెను తమ నాయకుడి భార్యగానే చూశారు మినహా నాయకిగా ఆమోదించలేకపోయారు. అందుకు తగ్గట్టుగానే ఆమె భర్తతోపాటు ప్రదర్శనలు, ఆందోళనలకు హాజరయ్యేవారు. అంతకు మించి ఆమె పాత్ర వుండేది కాదు. అయితే ఆ లోటును జయలలిత భర్తీ చేశారు. ఇకపోతే సైదా అస్సాం సీఎంగా కేవలం ఏడు మాసాల పాటే కొనసాగారు. ఇక సుష్మా స్వరాజ్ ఢిల్లీ సీఎంగా 51 రోజులు పనిచేశారు.

మైనారిటీ ముఖ్యమంత్రులు

మహిళలు రాజకీయాల్లోకి రావడమే తక్కువ. ఇక ముస్లిం మహిళల సంగతి చెప్పేదేముంది! చాలా అరుదు! అలాంటి వాతావరణం లోంచి ఇద్దరు ఆడవాళ్లు రాష్ట్రాలను ఏలేంతగా ఎదగడం గర్వించదగ్గ విషయం. వారే సయిదా అన్వారా తైమూర్, మెహబూబా ముఫ్తీ. దేశంలోనే మొదటిసారిగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన ముస్లిం మహిళ సయిదా అన్వారా తైమూర్. అస్సాంలోనే తొలి మహిళా సీఎం. పలుమార్లు ఎమ్మెల్యేగా, ఒకమారు రాజ్యసభ సభ్యురాలిగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించిన అపార అనుభవం అన్వారాది. సీఎంగా మాత్రం కొద్ది మాసాలే పని చేశారు. అర్థశాస్త్ర బోధకురాలిగానూ ప్రసిద్ధులు. మొదట కాంగ్రెస్ నేతగా వున్నప్పటికీ చివరికి ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌లో చేరారు.

ఇక మెహబూబా ముఫ్తీ... ఈ నెల మొదటి వారంలో జమ్ము కాశ్మీర్ సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జమ్ము కాశ్మీర్ 12వ ముఖ్యమంత్రి కాగా, దేశంలో 16వ మహిళా సీఎం. అలాగే ఆ రాష్ట్రంలో సీఎం అయిన తొలి మహిళ. రికార్డులను పక్కన పెడితే... దేశంలోకెల్లా అత్యంత సున్నితమైన సరిహద్దుగల, సమస్యాత్మక ప్రాంతమది. అలాంటి రాష్ట్రానికి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించడ మంటే కత్తి మీద సాము చేయడమే. అయితే రాజకీయ నేపథ్యం వున్న కుటుంబం నుంచి రావడం కొంతలో కొంత ఊరటనిచ్చే అంశం. ఆమె తండ్రి

ఆ పదహారు మంది ...

దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 16 మంది మహిళలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారి వివరాలు వరుసగా...
1. సుచేతా కృపలాని (ఉత్తర ప్రదేశ్, కాంగ్రెస్) **2.** నందిని సత్పతి (ఒడిషా, కాంగ్రెస్) **3.** శశికళ కకోద్కర్ (గోవా, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ) **4.** సయిదా అన్వారా తైమూర్ (అస్సాం, కాంగ్రెస్) **5.** జానకి రామచంద్రన్ (తమిళనాడు, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె) **6.** జె.జయలలిత (తమిళనాడు, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె) **7.** మాయావతి (ఉత్తర్ ప్రదేశ్, బి.ఎస్.పి **8.** రాజిందర్ కౌర్ భట్టల్ (పంజాబ్, కాంగ్రెస్) **9.** రబ్రీదేవి (బీహార్, ఆర్.జె.డి) 10. సుష్మా స్వరాజ్ (ఢిల్లీ, బి.జె.పి) **11.** షీలా దీక్షిత్ (ఢిల్లీ, కాంగ్రెస్) **12.** ఉమా భారతి (మధ్య ప్రదేశ్, బి.జె.పి) **13.** వసుంధర రాజె (రాజస్థాన్, బి.జె.పి) **14.** ఆనందీబెన్ పటేల్ (గుజరాత్, బి.జె.పి) **15.** మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్, టి.ఎం.సి) **16.** మెహబూబా ముఫ్తీ (జమ్ము కాశ్మీర్, పి.డి.పి)

పాంచ్ పటాకా

గతం లోంచి వర్తమానంలోకి వద్దాం. ఇవాళ ఐదు రాష్ట్రాల్లో మహిళలు అధికారంలో వున్నారు. మున్నెన్నడూ లేని విధంగా దేశం నాలుగు దిక్కుల్లోను మహిళల పాలన సాగుతోంది. ఉత్తరాదిన జమ్ము కాశ్మీర్‌లో మెహబూబా ముఫ్తీ, దక్షిణాన తమిళనాడులో జయలలిత, పశ్చిమాన గుజరాత్‌లో ఆనందీబెన్, తూర్పున పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఏలుతుండగా రాజస్థాన్‌ను వసుంధర రాజె పాలిస్తున్నారు. వీరందరిలో మెహబూబాను పసికూనగా చెప్పుకోవచ్చు. ఈ నెల నాల్గవ తేదీనే ఆమె సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. దాంతో సీఎంగా ఆమె అనుభవం అతి తక్కువ. ఇకపోతే తాజా అసెంబ్లీ ఎన్నికలలో మమత, జయ తమ అదృష్టాన్ని తాజాగా పరీక్షించుకోనున్నారు. ఆ ఫలితాలు వెలువడ్డాక ఎందరు మహిళా ముఖ్యమంత్రులు మిగులుతారో చూడాలి.

ముఫ్తీ మహ్మద్ సయీద్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పి.డి.పి) వ్యవస్థాపకులు. మాజీ ముఖ్యమంత్రి కూడా. మొదట తండ్రీకూతుళ్ళిద్దరూ కాంగ్రెస్‌లో వుండేవారు. చీలిపోయిన ముఫ్తీ సొంత కుంపటి పెట్టుకున్నారు. ఈ విషయమై తండ్రితో విభేదించినప్పటికీ పి.డి.పి ఉపాధ్యక్షురాలిగా బాధ్యత స్వీకరించడమే కాక ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో పార్టీ విజయానికి ఎంతగానో కృషి చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా అనుభవమున్న మెహబూబా తండ్రి మరణానంతరం బి.జె.పి మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వానికి రథసారధిగా మారారు.

కమల వనంలో విరిసిన సీఎంలు

బి.జె.పికి చెందిన మహిళా ముఖ్యమంత్రులు నలుగురు. సుష్మా స్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజె, ఆనంది బెన్. వీరిలో ప్రస్తుతం అధికారంలో వున్నది చివరి ఇద్దరే. ఇతరత్రా రాజకీయ అనుభవం ఎంతున్నా ఢిల్లీ ముఖ్యమంత్రిగా మాత్రం సుష్మా మేడమ్ 51 రోజులే పని చేశారు. ఎల్.ఎల్.బి పట్టా పుచ్చుకున్న సుష్మ బాల్యంలో ఉత్తమ విద్యార్థినిగా, ఉత్తమ ఎన్‌సిసి క్యాడెట్‌గా గుర్తింపు పొందారు. విద్యార్థినిగా వున్నప్పుడే రాజకీయాల పట్ల ఆకర్షితురాలయ్యారు. హర్యానా జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె అతి పిన్న వయసులోనే (25) మంత్రి అయ్యారు. పార్లమెంటులోని రెండు సభల్లోనూ సభ్యురాలిగా చేసిన అనుభవమూ వుంది. ప్రతిపక్ష నేతగానూ వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖను చూస్తున్నారు. అయితే ఆమె కుటుంబ నేపథ్యాన్ని మరువకూడదు. తండ్రి ఆర్.ఎస్.ఎస్ నేత.

భారతదేశంలో కాషాయ వస్త్రాలు ధరించే రాజకీయ నాయకురాలిగా ఉమాభారతికి ప్రత్యేక గుర్తింపు వుంది. తీర్థయాత్రలు, యాగాలతో జనాన్ని మాయ చేసే సన్యాసి నేత. పురాణాలు, ఆధ్యాత్మిక జీవితం పట్ల అత్యంత ఆసక్తి కనబరిచే ఉమాభారతి రాజకీయ జీవితంపై గ్వాలియర్ రాజమాత విజయరాజె సింధియా ప్రభావం ఎంతైనా వుంది. రెండు పదుల వయసులోనే బి.జె.పి సభ్యత్వం పుచ్చుకున్నారు. పాతికేళ్ళకే పార్లమెంటు ఎన్నికల్లో నిలబడినప్పటికీ పరాజయం చవిచూడాల్సి వచ్చింది. అయితే ఆ తర్వాత ఖజురహో నుంచి గెలుపొందారు. వాజ్‌పెయి ప్రధానిగా వున్న సమయంలో మానవ వనరుల అభివృద్ధి, యువ వ్యవహారాలు, క్రీడల రాష్ట్ర స్థాయి బాధ్యతలు చూశారు. 1992 అయోధ్య ఘర్షణల్లో కీలక పాత్ర పోషించారు. 2003లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి (2003 డిసెంబర్ – 2004 ఆగస్టు) అయ్యారు. అయితే కొద్ది నెలలకే ఆ ముచ్చట తీరిపోయింది. హుబ్లీ ఘర్షణల కేసు విషయమై అరెస్టు వారెంటు జారీ కావడంతో ముఖ్యమంత్రి పీఠాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అద్వానీకి వ్యతిరేకంగా మారి బి.జె.పి.ని విడిచిపెట్టి సొంత పార్టీ పెట్టుకున్నప్పటికీ తిరిగి సొంత గూటికే చేరుకున్నారు.

బి.జె.పి ప్రముఖ నేతలలో రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజె ఒకరు. రాజ వంశానికి చెందిన ఆమె తల్లి విజయ రాజె, సోదరుడు మాధవరావ్ సింధియా రాజకీయ రంగంలో గుర్తింపు కలవారు. తల్లి బి.జె.పి నాయకురాలు కాగా, సోదరుడు కాంగ్రెస్ నేత. హేమంత్ సింగ్‌తో ఆమె వైవాహిక జీవితం అంత సజావుగా సాగనప్పటికీ రాజకీయంగా మాత్రం తల్లిబాటలో నడిచి విజయం సాధించారు. మొట్టమొదట 1985లో అసెంబ్లీలోకి అడుగెట్టిన ఆమె ఆ తర్వాత బి.జె.పి రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షురాలిగా చేశారు. ఆ తర్వాత లోక్‌సభ సభ్యురాలిగా వరుసగా మూడు సార్లు ఎన్నికైన ప్రత్యేకత ఆమెది. వాజ్‌పెయి హయాంలోను, ఎన్డీయే కాలంలోనూ మంత్రిగా చేశారు. ఆ తర్వాత రాష్ట్ర బి.జె.పి అధ్యక్షురాలిగా 2003 అసెంబ్లీ ఎన్నికలలో విజయఢంకా మోగించి ప్రభుత్వాన్ని ఏర్పరచారు. 2013లోనూ అదే విజయం పునరావృతమైంది. అయితే ఆమె రాజకీయ జీవితంలో మరకలూ లేకపోలేదు. భారత ఖజానాకు లక్షల కోట్ల రూపాయల నష్టం చేకూర్చిన ఆర్థిక నేరగాడు లలిత్‌మోడీకి అనేక సమయాల్లో సాయం చేయడంతోపాటు, తన కుమారుడు దుష్యంత్‌కు లలిత్‌కు మధ్య వున్న వ్యాపార లావాదేవీల విషయంలోనూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

గుజరాత్ నుంచి మోడీ ఢిల్లీకి మారాక... ఆ స్థానాన్ని ఆనందీబెన్ పటేల్ భర్తీ చేశారు. విచిత్రంగా మోడీ, బెన్ ఒకే హైస్కూల్లో చదువుకున్నారు. డిగ్రీ చదివే రోజుల్లో కాలేజీలో బెన్ మినహా అందరూ అబ్బాయిలే. టీచర్‌గా వున్న కాలంలో పిక్నిక్‌కి చిన్నారులను తీసుకెళ్ళినప్పుడు జరిగిన ఓ ఘటన ఆమెను రాజకీయాలవైపు నడిపించింది. నీళ్లలో మునిగిపోతున్న ఇద్దరు విద్యార్థులను కాపాడిన ఆమె రాష్ట్రపతి సాహస అవార్డు అందుకున్నారు. అలా బి.జె.పి బడానేతల దృష్టిలో పడిన ఆమె వారి సలహా మేరకు కమలం తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీకి చెందిన పలు విభాగాలకు నాయకత్వం వహించిన ఆమె 1994లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. తర్వాత ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగెట్టడమే కాక విద్యా మంత్రిగా చేశారు. నాల్గవ సారి ఎమ్మెల్యే అయ్యాక... అనుకోని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. ఆ రాష్ట్ర సీఎంగా వున్న మోడీ ప్రధాని కావడమే అందుకు కారణం. ఇంత సుదీర్ఘ రాజకీయ జీవితంలో తన కుమార్తెకు సంబంధించిన అనేక ఆరోపణలు మాత్రం మచ్చగానే మిగిలిపోయాయి.

విధానాలు కీలకం

మహిళా ముఖ్యమంత్రుల్లో పితృస్వామిక చట్టం–సంస్కృతికి అనుగుణంగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నవారే అత్యధికులు. సిద్ధాంతాలు, పార్టీ విధానాలకు అనుగుణంగానే ఫలితాలు వుంటాయి. సదరు పార్టీ విధానాలు సరళీకరణ, ప్రయివేటీకరణకు అనుకూలమైనవైతే... ఆ మహిళా ముఖ్యమంత్రి భూమి, ఉపాధి, నీరు వంటి సదుపాయాలను కల్పించలేరు. అదే సమయంలో ఆ పార్టీ అవినీతిపరులు, నేరస్థులతో నిండి వుంటే కుంభ కోణాలు, మహిళలపై నేరాలను ఆమె ఏమాత్రం అదుపు చేయలేరు. ముఖ్యమంత్రిగా మహిళ వున్నా పురుషుడున్నా ఫలితం ఒక రకంగానే వుంటుంది. అందుకే ఇక్కడ వారు అవలంబించే విధానాలు ముఖ్యం.

✦

గార్డ్ రుణం

కిఫ్లీబ్ టెకల్ డల్లాస్‌లోని హాక్డే స్కూల్‌లో సెక్యూరిటీ గార్డు. ముప్పై యేళ్లుగా బాధ్యతలు నిర్వర్తించి ఈ మధ్యే రిటైరయ్యాడు. అల్లరి మూకల నుంచి పిల్లలను కాపాడటంలో కిఫ్లీబ్ తెగువకు చాలా మంది టీచర్లు, విద్యార్థులు అభిమానులయ్యారు. టీచర్లు కూడా గుర్తెరుగని విద్యార్థుల పేర్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుని పలకరిస్తుంటాడు కిఫ్లీబ్. గన్ కల్చర్ విపరీతంగా ఉండే అమెరికాలో.. విద్యాసంస్థల్లో కాల్పుల కలవరం చాలా ఎక్కువ. ఓ సారి ఓ ఆగంతకుడు స్కూల్లోకి చొరబడటంతో ప్రాణాలకు తెగించి అతణ్ని పట్టుకున్నాడు. ఆ ప్రయత్నంలో చేయి కూడా విరగ్గొట్టుకున్నాడు. తమను కంటికి రెప్పలా చూసుకునే కిఫ్లీబ్ వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు ప్రస్తుత, పూర్వ విద్యార్థులు. ఏకంగా 92 లక్షలా 50 వేల రూపాయలు ఫండ్ సేకరించి ఇచ్చారు. క్షణం తీరిక లేని ఉన్నత వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమానికి 200 మంది వరకు హాజరవడంతో ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యాడు కిఫ్లీబ్.

వింత లోకం

ఖరీదైన సమాధి వీధి..

పచ్చని చెట్లు, చక్కటి రోడ్లు, అత్యాధునిక సదుపాయాలు ఉన్న విశాలమైన భవనాలతో నిండిన వీధి అది. చెప్పాల్సిన విషయమేమంటే అదో సమాధి స్థలి. ఫిలిఫ్ఫీన్స్ రాజధాని మనీలాలోని చైనీయుల సమాధి స్థలి ప్రాంతమే అది. బాత్‌రూమ్‌లు, వంట గదులు, పడక గదులు, విజిటింగ్ హాల్‌తో పాటు జిమ్‌లు కూడా ఉంటాయి. సందర్శకుల కోసం రెస్టారెంట్ కూడా ఉంది. విద్యుత్, తాగు నీటి సరఫరాకు ఏ ఆటంకం ఉండదు. టెలి ఫోన్, ఇంటర్నెట్ సేవలు సదా అందుబాటులో ఉంటాయి. ఒకప్పుడు స్పెయిన్ పరిపాలనలో ఉన్న మనీలాలో చైనీయుల అంతిమ క్రియలకు కాథెలిక్ స్మశాన వాటికల్లో అనుమతి ఉండేది కాదు. చైనా వర్తకుల్లో కొందరు ఈ స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇదో టూరిస్ట్ స్పాట్‌గా మారింది. చనిపోయినవారిని గౌరవిస్తూ ఎటువంటి డాబు దర్పాలు లేకుండా సమాధుల్ని నిర్మించాలని పెద్దలు ఓ శిలాఫలకాన్ని అప్పట్లో వేసినా దాన్ని పట్టించుకోలేదు. కొందరు బంధువులు వాటినే తమ స్థిర నివాసాలు మార్చేసుకుని బతుకు బండి లాగించేస్తున్నారు.

కార్ ఇల్లు

అమెరికాలో రీజనల్ సేల్స్ మేనేజర్‌గా బాగా సంపాదిస్తున్న ఎడ్వర్డ్ మెల్డీ (26) నివాస విషయంలో మినిమలిస్ట్‌గా ఓ నిర్ణయం తీసుకున్నాడు. విలాసాలకు పోకుండా ఖరీదైన ఇంటిలో కాకుండా కనీస అవసరాలన్నింటినీ ఓ కార్‌లోకి సర్దేసుకుని ఏడాదిగా గడిపేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అమెరికాలో ఇతనో 5000 మైళ్ల బ్యాక్‌ప్యాకర్ పర్యటన చేసొచ్చాడు. అప్పుడు మెల్‌డీ ఏ ఇబ్బంది లేకుండా ఓ కార్లోనే నిద్రలు, తిండి తిప్పలూ అన్ని కానిచ్చేవాడు. ఇదేదో బానే ఉందనుకుని ఇప్పుడు పూర్తిగా కార్‌నే ఇల్లుగా చేసుకున్నాడు. బహిరంగ ప్రదేశాల్లో ఉండే టాయిలెట్లను వినియోగిస్తూ కారులో రోజుల్ని గడిపేస్తున్నాడు. చార్జింగ్ కోసం ఇన్‌వర్టర్, క్యాంపింగ్ స్టవ్ ఇలా అన్నీ సౌకర్యాలు సమకూర్చుకున్నాడు. జీవిత భాగస్వామి దొరికినా కూడా మరింత పెద్ద కార్‌లో కాపురం పెడతాడట.

కవలల్ని గుర్తించడంలో కుటుంబ సభ్యులూ ఇరకాటంలో పడతారు. అదే ఇక ఒక కవల జంట మరో కవల జంటను వివాహమాడితే! చైనాలోని యున్‌చెంగ్‌కు చెందిన ఇద్దరు ట్విన్ అన్నదమ్ములు, ఇద్దరు ట్విన్ అక్కాచెల్లెళ్లను పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వీరందరికీ 22 ఏళ్లు. జావో జిన్, జావో జున్ బ్రదర్స్ పక్క గ్రామంలోని యున్ ఫోయ్, యున్ యాంగ్ సిస్టర్స్‌తో ప్రేమలో పడ్డారు. కొన్నాళ్లకు పెద్దల అంగీకారంతో పెళ్లి కూడా జరిగింది. గొంతుక కూడా ఒకే రకంగా ఉండటంతో ట్విన్ సోదరుల్లో ఒకరు పొరబాటున మరొకరి భార్య చేయి పట్టుకోవడంతో క్షమాపణలు చెప్పుకోవాల్సొచ్చింది. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు మరిన్ని తలెత్తకుండా షాంఘైలోని ప్లాస్టిక్ సర్జరీ నిపుణుల సహాయం తీసుకున్నారు. నుదురు, ముక్కు భాగాలకు సూక్ష్మమైన శస్త్ర చికిత్స చేస్తే వారి సహజత్వం కోల్పోకుండానే వాళ్లని గుర్తించడం తేలికవుతుందని వైద్యులు సలహా ఇచ్చారట.

కవల జంట కష్టాలు



ఈ స్మార్ట్ ఫోన్ల యుగంలో జీపీఎస్ సౌకర్యాన్ని మించి అవసరంగా మారిపోయింది. కొత్త ఊళ్లకు రూట్ తెలియాలన్నా, మహా నగరాల్లో చిరునామా పట్టుకోవాలన్నా, ప్రపంచం మొత్తాన్ని ఓసారి పరికించాలన్నా అదుంటే చేతిలో పనే. అలాంటి జీపీఎస్‌లో మనకు సమాచారం చెప్పే ఓ స్త్రీ గొంతు చాలా ప్రత్యేకంగా, స్పష్టంగా, ఆకర్షణీయంగా ఉంటుంది కదా. ఆ గొంతు విని వినీ మనకు బాగా తెలిసిన గొంతు అయిపోయింది. మనకే కాదు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని రోజు ఆ గొంతు పలకరిస్తుంది. ఆ గొంతునిచ్చిన జీపీఎస్ గర్ల్ ఎవరో తెలుసా?



జీపీఎస్‌కు స్వరం

'డెస్టినేషన్ ఈజ్ 500 మీటర్స్ అవే', 'బ్రిడ్జ్ అహెడ్.. 100 మీటర్స్..', '10 మీటర్స్.. ప్లీజ్ టర్న్ లెఫ్ట్', 'యూ హావ్ రీచ్‌డ్ ది డెస్టినేషన్' డిజిటల్ ధ్వనిలో ఈ మాటలు ఎక్కడో విన్నట్టుందే. అదే జీపీఎస్‌లో డెస్టినేషన్ ఫిక్స్ చేసి డ్రైవ్‌కెళితే ప్రతి కొన్ని నిమిషాలకు రూట్‌లో ఎదురయ్యే అడ్డంకులు, మలుపులు, ల్యాండ్‌మార్క్‌లు ఇంకా వాతావరణం, ట్రాఫిక్ పరిస్థితులు ఇలా సకల సమాచారంతో కొత్త ప్రదేశాలకు మన ప్రయాణాన్ని చాలా స్మూత్‌గా సాగిపోయేలా చేస్తాయివి. ఇక ఐ-ఫోన్ అభిమానులకైతే 'సిరి' పేరుతో ఈ వాయిస్ బాగా పరిచయం. కంప్యూటర్ మాట్లాడితే ఇలా ఉంటుందేమో అన్నంత క్లియర్‌గా ఉంటుందీ వాయిస్. కొందరు కంప్యూటర్ జనరేటెడ్ వాయిస్ మెషీన్ పలికే మాటలేమో అని కూడా సందేహపడతారు. కానీ అది కంప్యూటర్‌లో ముందే రికార్డ్డ్ చేసిన ఓ ఆస్ట్రేలియన్ మహిళ కంఠం. కొన్ని వేల మాటలకు తన గొంతుకను అద్దేకిచ్చిన ఆమే న్యూయార్క్‌లో స్థిరపడిన కేరెన్ ఎలిజబెత్ జాకబ్సన్. ఆ మహానగరంలో లక్షల బిజీ జీవుల్లో ఒకరిగా తప్పిపోయిన ఆమె ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఎలా ఇలా తన



మాటలతో దగ్గరైందనేది చాలా ఆసక్తికరమైన కథ. 'జీ.పీ.ఎస్. గర్ల్'గా గుర్తింపు పొందిన ఆమె ఇప్పుడో సెలబ్రెటీ ఎంటర్‌టైనర్, గాయని, వక్త, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్, గీత రచయిత. ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్‌లోని మాక్కేలో పుట్టిన కేరెన్ ఏడేళ్ల వయసు నుంచే పాటలు రాయడం మొదలెట్టింది. అక్కడి పాప్ సంచలనం ఒలివియా న్యూటన్-జాన్ ప్రేరణతో ఓ ప్రొఫెషనల్ సింగర్‌గా ఎదగాలని తపన పడింది. పియానోలో, గాత్రంలో క్వీన్స్‌ల్యాండ్ కన్జర్వేటోరియమ్ గ్రిఫిత్ విశ్వవిద్యాలయంలో మేజర్ చేసింది. ఆమెకు ఆ రంగంలో జాజ్ ప్రైజ్ కూడా లభించింది. స్థానిక యూత్ కోయిర్‌లో చేరి ప్రతిభను చాటి ఆ యేటి మేటి వరానా యువ ప్రదర్శనకారిణిగా సత్తా చాటింది. తర్వాత సిడ్నీ చేరుకుని తన అవకాశాల్ని మెరుగుపరుచుకుంది. 'గుడ్ మార్నింగ్ ఆస్ట్రేలియా', 'ఐ డూ ఐ డూ' కార్యక్రమాలతో పాటు అనేక టీవీ, రేడియో, ఆన్‌లైన్ కమర్షియల్స్‌కు తన గొంతునిచ్చింది. దాదాపు పదేళ్లపాటు ఆస్ట్రేలియాలో టీవీ, రేడియోల్లో ఆమె స్వరం వినకుండా రోజు మొదలయ్యేది కాదు.. ముగిసేది కాదు. నూతన సహస్రాబ్దిలో న్యూయార్క్‌కు ఒక సూట్‌కేస్ బోలెడు పెద్ద కలలతో చేరుకున్న కేరెన్ 'కర్లీ క్వీన్' పేరిట పాప్ ఆల్బమ్స్‌ను విడుదల చేసింది. కానీ అంతగా ఆదరణ రాలేదు. ఇప్పుడు తానుంది ప్రపంచ సంగీత రంగంలో.. తన ఉనికిని చాటుకోవడానికి ఓ పెద్ద అవకాశం రావాలి. అందుకు గ్రామీ, టోనీ, ఎమ్మీ అవార్డ్ విజేతలతో కలిసి పనిచేసింది.

2002లో ఓ అవకాశం ఆమెను పూర్తిగా కొత్త సౌండ్ ట్రాక్‌లో పడేసింది. డిజిటల్ వాయిస్‌గా రికార్డు చేసేందుకు ఆడిషన్స్ జరిగితే కేరెన్ కంచు కంఠాన్ని ఎంపికచేశారు. గార్మిన్, మియో, నవ్‌మాన్, టామ్‌టామ్ వంటి టెలిఫోన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలకు అనుకుని తన గాత్ర సాయం చేసింది. 50 గంటల పంక్తులకు ఆమె గొంతునిచ్చింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు మూడు వారాల పాటు స్టుడియోలో రికార్డ్ జరిగేది. ఇవన్నీ ఆస్ట్రేలియన్ ఇంగ్లిష్ ఆప్షన్‌లో ఉండే జీపీఎస్ టెక్స్-టు-స్పీచ్ ప్రోగ్రామ్‌లే. కానీ ఆమె ఊహించని విషయమేమంటే ఇక నుంచి ఆమె మాటలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి డైరెక్షన్స్ చూపిస్తాయని. రెండేళ్ల తర్వాత ఆమె స్వరాన్ని గుర్తుపట్టి ఆస్ట్రేలియా నుంచి ఓ స్నేహితురాలు ఫోన్ చేసే వరకు ఆమెకా విషయం తెలీదు. తర్వాత క్రిస్మస్‌కు సొంతూరు వెళితే కార్ జీపీఎస్ వ్యవస్థలో మాటలు విని తనకు తానే మార్గం చెప్పుకోవడం వింతగా అనిపించిందట. కుటుంబంతో కలిసి హవాయ్ పర్యటనకు వెళ్లినపుడు పర్యాటక స్పాట్ల డైరెక్షన్స్ కోసం జీపీఎస్‌ను ఆన్ చేస్తే మాటలు విని అవి తన తల్లివేనని ఆరేళ్ల కొడుకు హేడెన్ గుర్తుపట్టి అమ్మా ఇక్కడ కూడా నువ్వే ఉన్నావా అని ఆశ్చర్యంగా చూసే సరికి ఆమె భావోద్వేగానికి లోనైంది. సినీ స్టార్లను వారి ముఖాలతో గుర్తుపడితే.. కేరెన్‌ను మాటల ద్వారా వీధుల్లో జనాలు గుర్తించి ఆమెను చుట్టుముడతారట. అన్నింటికీ మించి ఆమె కంఠం బాగా వినివిని ఆమెను తమ కుటుంబ సభ్యురాలిగా చూసుకోవడమే భావన ఎక్కడలేని సంతోషాన్నిసు ందని కేరెన్ అంటారు. న్యూయార్క్‌లోని ప్రముఖ వార్తా సంస్థలో 'గాడ్జెట్ గర్ల్', 'ది డ్యాష్‌బోర్డ్ దీవా' కార్యక్రమాలకు కూడా డబ్బింగ్ చెప్పింది. ఇవన్నీ స్మార్ట్ ఫోన్ ప్రపంచానికి సంబంధించినవే.

\- జే

సంతోషమొస్తే ఓ చిందేసి చూపిస్తాం. కేవలం అంతేనా.. జీవితంలోని
నృత్యాల్లో కళ్లకు కట్టొచ్చు. ఓ చిన్ని ఆనందానికీ, ఓ గొప్ప ఘట్టానికీ
కళారంగానికి సేవలు అందించే నృత్యకారులెందరో. అందుకే నాట్యాని
దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా కొన్ని వివరాలు,

ప్రపంచం

కూచిపూడి

థింసా

ప్రపంచ నృత్య దినోత్సవ వేడుకల వల్ల నృత్యంపై ప్రజల్లో కలిగిస్తున్న స్పృహ, జాగృతి, ప్రాధాన్యతలు అంచెలంచెలుగా పెరుగుతున్నాయనే చెప్పవచ్చు. ప్రజలలో రాజకీయ, సాంస్కృతిక, భాష వంటి అడ్డుగోడల్ని ఛేధించుకుంటూ విశ్వవ్యాప్తిగా గుర్తు చేస్తూ అందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం. 1982 నుండి ఏటా డ్యాన్స్ డే వేడుకల్ని జరుపుకుంటున్నారు.

వేడుకల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఓపెన్ డోర్ కోర్సు ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేస్తారు. అన్ని నాట్య రీతులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ఈ కళారంగానికి చెందిన ఓ విశిష్ట వ్యక్తితో నాట్యంపై సందేశాన్ని ప్రపంచానికి అందించటం ఆనవాయితీగా వస్తోంది.

పల్లెల్లో చిందులు

సాధారణంగా జానపద, గిరిజన నృత్యాలన్నీ ఫోక్ డ్యాన్స్ కోవకు చెందినవి. శాస్త్రీయ నృత్య రీతులు ప్రత్యేక వేదికలపైనా ఆలయాల వద్ద వివిధ సందర్భాలలో ప్రదర్శిస్తారు. కానీ ఫోక్ డాన్స్ అలా కాదు. గ్రామీణ ప్రాంతాల్లో పనిలో భాగంగా ఆచార సంబంధ విషయాల్లో వ్యక్తులు గుంపుగా వీటిని ప్రదర్శిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రమ నుంచి ఈ జానపదాలు పుట్టాయి. శాస్త్రీయ నృత్యాలతో సమానంగా ఇవి జనాదరణ పొందాయి. శాస్త్రీయ నృత్యాలు నేర్చుకునే పద్ధతికి కాస్త భిన్నంగా పెద్దల నుంచి వారసత్వంగా తీసుకుని మెరుగులు దిద్దుకుంటారు. జానపదాల్ని సంక్రమిత సంప్రదాయం అనవచ్చు. సాంప్రదాయిక జానపద నృత్యాల్ని రంగస్థలాలపై కూడా ప్రదర్శిస్తున్నారు. జానపద కళలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కోర్సులను కూడా విశ్వ విద్యాలయాలలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ జానపద కళలు ఏ ఒక్క దేశానికో, రాష్ట్రానికో సంబంధించినవి కాదు. ప్రతీ దేశంలోనూ, రాష్ట్రాలలోనూ వీటిని గమనించవచ్చు. భారతదేశంలో కోలాటం, థింసా, బిహు, రాస్, యక్ష గానం, భాంగ్రా, ఘూమర్, కరగట్టమ్, దాద్రా మొదలైనవి జానపద నాట్యాలు.

ఒక్కో ప్రాంతం ఒక్కో రూపం

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు నృత్య రీతులను అక్కడి సాంప్రదాయక నృత్య రీతులుగా చెప్పవచ్చు. ప్రతి నృత్యరీతి ఒక్కో ప్రత్యేకతతో విరాజిల్లుతూ దేశంలోనే కాక అంతర్జాతీయ వేదికలపై కూడా తమ ముద్ర వేశాయి. విదేశీ కళాకారుల దృష్టిని కూడా ఆకర్షిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. తమిళనాడులో భరతనాట్యం, ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి ఆంధ్రనాట్యం, కేరళలో కథాకళి (పురుషులకు), మోహినీ యాట్టం (స్త్రీలకు), మణిపూర్‌లో మణిపురి, ఉత్తర భారతదేశంలో కథక్, ఒరిస్సాలో ఒడిస్సి, భారతదేశం పడమటి భాగంలో (ఒరిస్సా, బీహర్) ఛావ్ నృత్యాలు విశిష్టత సంతరించుకున్న శాస్త్రీయ నృత్య రీతులు.

ఆధునిక స్టెప్పులు

హిప్ హాప్ డ్యాన్స్ ఓ సంగీత శైలి నుంచి ఆవిర్భవించింది. మొదటగా దీని ప్రవేశం 1970లో జరిగింది. ప్రజాదరణ, మీడియా ఎక్స్‌పోజర్.. సినిమా, టీవీల



మైకేల్ జాక్సన్ మూన్ వాక్

ఫలితంగా ఈ హిప్ హాప్ డ్యాన్స్
కొరియాలో గట్టిగా నిలదొక్కుకు
డ్యాన్స్‌లు రంగప్రవేశం చేశాయి.
క్రేజ్ సంపాదించు కున్నాయి. కొ
అనుకూలంగా ఉండటంతో పా
కుర్రకారుకి ఈ శైలులు వారి న
కోవకు చెందినవి. బ్రేక్ డాన్స్, బె
డ్యాన్స్. మైఖేల్ జాక్సన్, డాన్ కా
స్టెప్పులతో వీటి క్రేజ్‌ను ప్రపంచ
ఒక్కో స్టెప్పును తమ ట్రేడ్ మార్క
స్లైడ్ చేస్తూ మైఖేల్ జాక్సన్ వేసి
బుడతలు నేర్చుకుంటూనే ఉంటా
మోడ్రన్ డ్యాన్స్‌కు ఓ ఐకాన్‌లా

జాజ్ నృత్యాలు

విస్తృతమైన నృత్య శైలుల్లో జా
అమెరికా శాస్త్రీయ నృత్యాల న
చెప్తారు. 1950లో కరేబి య
నుంచి జాజ్ నృత్యంలో ఒక న
ఒక్క భంగిమ లోనూ వాటి
మూలాలు కనిపిస్తాయి. చార్ల
స్వింగ్, ట్యాప్ డాన్స్, మూన్
బూగీ వూగీ వీటిలోని ప్రముఖ
శైలులు. జోసెఫిన్ బేకర్ (జా
సామ్మీ డేవిస్, జార్జ్ హైన్స్ (ట
డ్యాన్స్), డీన్ కొల్లిన్స్, నోర్మా
(స్వింగ్), జాక్కోలె (రంగస్థల
పితామహుడు) మేటి డ్యాన్సర
గుర్తింపు పొందారు.

మ్యూజిక్ టెక్నాలజీలో అభి

భలా బ్యాలే

యూరప్‌లో కళారంగ పునరుజ్జీవన శకం
నృత్యం కాన్సర్ట్ డాన్స్‌గా రూపు సంత
కాలంలో హవా చాటుతున్న కాన్‌టెం
క్లిష్టతలోనూ శారీరక శ్రమలోనూ బ్యా

ప్రముఖులు

వాస్లీ నీజినస్కీ, మార్థా గ్రాహ

మలుపుల నుంచి ప్రపంచ విషయాల వరకు నేర్పుగా
చూపుకట్టే డ్యాన్స్ మనకో ప్రత్యేక భాష. అదే శ్వాసగా
కి ప్రత్యేకంగా ఓ రోజును ఏప్రిల్ 29న ప్రపంచ నృత్య
విశేషాలు..

నర్తిస్తే..

వాల్ట్జ్

అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, ఉత్తర
ది. ఇలా ఫంక్ శైలిలో మరిన్ని
అవి మన దేశంలోనూ పెద్ద ఎత్తున
కొత్త ప్రయోగాలకు
సృజనకు హద్దులేకపోవడంతో
తను పట్టి చూపే సింబాలిక్స్. ఈ
న్స్, ఎలక్ట్రిక్ బూగాలూ, స్ట్రీట్
పిల్, సైరా డచ్‌లు తమ
ంతటా పాకించేశారు. ఒక్కొక్కరు
గా మలిచారు. పాదాల్ని నేలపై
మూన్ వాక్‌ను ఇప్పటికీ
రు. ఆయన ప్రతిభకే కాదు అది
లిచిపోయింది.

ఒకటి. 1850లో ఆఫ్రికా,
ంచి వచ్చిన శైలిగా జాజ్ నృత్యాన్ని
సంప్రదాయ నృత్య మూలాల
ూతన శైలి ఆవిర్భవించింది. ప్రతి

న్,
ాక్,

),
ప్
ల్లర్స్
ట్య
గా

ద్ధి ఫలితంగా

ో ప్రొఫెషనల్ బ్యాలే
ంచుకొంది. ఆధునిక
రరీ, మోడ్రన్ డాన్స్‌లు కాన్సర్ట్
డాన్స్‌ను మించలేకపోయాయి.

, రూడిల్, ఆస్టాబ్ డిబో

బాల్‌రూమ్ డ్యాన్స్‌లు

ఇటలీ పునరుజ్జీవన కాల తొలిదశలో మొట్టమొదట బాల్ రూమ్ డాన్స్ ఫామ్ వెలుగు చూసింది. క్రమంగా ప్రజాదరణ పొందుతూ యూరప్, అమెరికాల్లోనే కాక ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. సులువైన ఇతర డ్యాన్స్‌లు కొంత అవరోధం కలిగించినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక నృత్యాల పట్ల ఆసక్తి ఉన్న ప్రేక్షకులు వీక్షిస్తూ ఈ సజీవ కళకు పునరుజ్జీవనం కల్పించారనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

శైలులు

వాల్ట్జ్, వియన్నీస్ వాల్ట్జ్, ట్యాంగో, చా–చా, రుంబా, సాంబా, మాంబో, క్విక్‌స్టెప్, బొలేరో, జైవ్

ప్రముఖులు

మ్యాట్ బార్బర్, డోన్నీ బర్న్స్, మేరీ ముర్ఫీ (బాల్ రూం డాన్స్) వెర్నెన్, ఐరీన్ కేజిల్ (కపుల్ బాల్ రూం డాన్స్), నార్బెర్టో ఎస్‌బ్రెజ్ (ట్యాంగో)



ఫ్లేమెంకోలోని ఆరంభ స్టెప్

ఎన్నో కొత్త రీతుల నృత్యాల ఆవిర్భావం జరిగింది. ఎలక్ట్రానిక్, రాక్, మెటల్ మ్యూజిక్‌ల ప్రవేశంతో కొత్త శకానికి నాంది పడింది. వాటి ఫలితమే హోస్ ఫింక్, డిస్కో డ్యాన్స్‌లు. మతపరమైన నమ్మకాలు, విశ్వాసాలు అధికంగా ఉండటం వల్ల భారతదేశంలో ఇలాంటి మార్పుల పట్ల పెద్దగా ఆసక్తి చూపించనప్పటికీ తర్వాత కేవలం దైవ సంబంధమైన అంశాలనే కాక నిత్య జీవిత విశేషాలు నాట్యంలో ఆవిష్కరించటం జరుగుతోంది.

- సింహాద్రి నాగశిరీష

లాటిన్ నృత్యాలు

లాటిన్ అమెరికాలో పెళ్లి నుంచి పండుగల వరకు ప్రతి విందు వినోదంలో తారాస్థాయికి చేర్చేవి నృత్యాలే. వారు ప్రతి సంతోషాన్నీ చిందులు వేస్తూనే ప్రదర్శిస్తారనడంలో అతిశయోక్తి లేదు. ఎన్నో లాటిన్ శైలులు అలా పుట్టినవే. చిన్ననాటి నుంచే ప్రతి ఒక్కరికీ ఏదో ఒక దానిలో కాస్తన్నా ప్రవేశం ఉంటుంది. అంతలా వారి జీవితాల్లో డ్యాన్స్ పెనవేసుకుపోయింది. ఈ లాటిన్ నృత్యాలు ఖండాంతరాలు దాటి ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రదర్శన వేదికల్లో తమ ప్రత్యేకతను చాటుతున్నాయి. వీటిల్లో సాల్సా, ఫ్లామెంకో, అర్జెంటైన్ ట్యాంగో, పోల్కా, జైవ్, కేపొయిరా, ఈస్ట్‌కోస్ట్ స్వింగ్, ఫోక్ డాన్స్, కంట్రీ/ వెస్టన్ డాన్స్, బెల్లీ డ్యాన్స్‌లు ప్రత్యేకం.

ప్రముఖులు

ఫిఫియాబ్డో, అమెరా ఈద్, సామియా గామల్ (బెల్లీ డ్యాన్స్), యోవాక్విన్ కార్టెస్, సారా బరస్, ఆంటోనియో గేడ్స్ (ఫ్లామెంకో), అలెక్స్ డి సిల్వా (సాల్సా)

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

నీకు .... జాలి మాటలొద్దు

ఏ సమాజం నిన్ను చూసి జాలిపడిందో
అక్కడి నుండే నువ్వు
పద్మంవలె పొడుచుకురావాలి...
కన్నీటి చుక్కలు కార్చొద్దు.
ఏ సమాజం సంకెళ్ళు విధించిందో
ఆ బానిస సంకెళ్ల తెంపు....
నీకు.. జాలిమాటలొద్దు...
నువ్వు... జనించే, జ్వలించే
అగ్ని కణమై వెలుగు
పెనుమంటల్ని మండించు
ఈ పితృస్వామిక వ్యవస్థపై
నీకు, నువ్వే....
ఒక పునరపి ప్రకటనలా ప్రకోపించు
రణరంగభేరిని మ్రోగించు...
నీకు...నువ్వే...మేల్కోవాలి...
నిన్ను....నువ్వే... వెలిగించుకోవాలి
ఆ వెలుగు బాటను అందరికీ చూపించాలి...
నీకు....నువ్వే వెలుగు దివ్వెలు
కావాలి....అమ్మ.

- తంగిరాల సోని
9676609234



స్మార్ట్ ఫ్రెండ్

అలా నడుస్తుంటే ఎదురయ్యాడొకడు
పరిచయస్తుడిలా వున్నాడే!
పలకరించడేం!
పరికించి చూసేలోపే జారుకున్నాడు
తనదారిన తాను బిజీగా...
ఔనులే ఇది బిజీకాలం
సరిపెట్టుకున్నా..
అలా సరిపెట్టుకున్నా
ఏదో జ్ఞాపకం మెలిపెడుతుంది
వాడ్ని బాగా ఎరిగినట్లు
గొప్ప స్నేహమేదో వున్నట్లు!
ఎక్కడ? .... ఎక్కడ?...
బుర్రకు పని చెప్పా
తెలిసిన తలపులన్నీ తెరిచా
విందులోనా?...వినోదంలోనా?...
సభలోనా?...సమావేశంలోనా?....
ఎక్కడ.........?
ఏ ఊసులో కనిపించడేమి?
ఏ ధ్యాసకు అందడేమి?
అయినా ఆరాటం తగ్గదే
అతని జాడకు దిగులే
యోచిస్తూ ....యోచిస్తూ....
ఇంటికెళ్ళా.... యథాలాపంగా
"ఫేమ్‌బుక్ " తెరిచా
చిరునవ్వులు చిందిస్తూ
వాడు
లైకులు, షేరింగులు, చాటింగులతో
నా ప్రొఫైల్ పేజి నిండా వాడే...
కథలు, కవిత్వాలు, వగైరాలు
వాడివి-నావి...అటూ-ఇటూ
ఔను మరి!
ఒక శుభోదయాన వాడి రిక్వెస్టు
అంగీకరించిన నా స్టేట్‌మెంటు
వెరసి...." వుయ్ ఆర్ నౌ ఫ్రెండ్స్"
అన్న ఫేమ్‌బుక్ చిరునవ్వుల చాక్లెట్టు
అలా నాకూ వాడికి స్నేహం...
మరి పలకరించడేం?
నేనూ పలకరించలేదేం?
సరే....వాడెక్కడివాడో?
ఇక్కడేం పనో?
వాడి చిరునామా వెదికా ఫేమ్‌బుక్ లో
దిమ్మతిరిగి పోయా ఆ షాక్‌లో
వాడిది మా ఊరే
ఉండేది మా ఊరే
ఉండేది మా వీధిలోనే...అదీ
మాకు రెండిళ్ళ అవతలే ...హో!!!

- నూనెల శ్రీనివాసరావు
9492970231

తెలుసా

ఈ ప్రాణాలకు లెక్కేది?

జంతువులపై ప్రయోగించిన మందుల్లో సురక్షితమైనవిగా ప్రయోగాత్మకంగా నిర్ధారించబడిన 92 శాతం మందులు మానవ క్లినికల్ ట్రయల్స్‌లో అతి ప్రమాదకరమైనవిగా లేదా పనికిరానివిగా తేలాయి. అయినా మందుల పరీక్షల పేరిట జంతువులను ఎందుకు హింసిస్తున్నారనేది జంతు ప్రేమికులు పెటా ప్రశ్న.

ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాలు మిగతా ప్రపంచ దేశాల కంటే ఎక్కువగా జంతువులపై ప్రయోగాలు చేస్తుంటాయి.

ఏప్రిల్ 24 ప్రయోగశాలల్లోని జంతువుల దినోత్సవం సందర్భంగా

కుక్కలపై వైద్య పరమైన ప్రయోగాలను 1657లో మొట్టమొదట క్రిస్టోఫర్ రెన్ నిర్వహించారు.

ప్రపంచవ్యాప్తంగా సుమారు 11 కోట్ల 50 లక్షల జంతువులపై ఏటా ప్రయోగాలు చేస్తుంటారని 'క్రూయెల్టీ ఫ్రీ ఇంటర్నేషనల్' అంచనా. కానీ, కేవలం 25 కొత్త రకాల మందులు మాత్రమే డ్రగ్ రెగ్యులేటర్స్ ఆమోదం పొందుతున్నాయి.

ప్రతిసారి జంతువుల రక్త నమూనాల కోసం, ఇంజెక్షన్ ద్వారా వాటి కణాలను సేకరించేందుకు వాటి బోను వద్దకు వచ్చే వారి అలికిడి వినపడగానే అవి భయంతో వణికిపోతుంటాయి.

జంతువులపై చేసే రసాయనిక ప్రయోగాలు, నిత్యం కొనసాగే శస్త్ర చికిత్సలు, వాటి మెదడులోకి చొచ్చుకుపోయే తీగలు, వెన్నెముకను పిండి చేసే ఎన్నో రకాల ప్రయోగాలతో చిత్ర హింసలే కాక వాటికి ఇంతకు ముందెన్నడూ సోకని వ్యాధులకు గురిచేస్తున్నారు.

గృహోపకరణ వస్తువులకు సంబంధించి జంతువులపై చేసే ప్రయోగాల్లో డెన్మార్క్‌ది మొదటి స్థానం.

హ్యూమేన్ సొసైటీ లెక్కల ప్రకారం ఒక పెస్టిసైడ్ రిజిస్టర్ అవ్వాలంటే కనీసం 50 సార్లు ప్రయోగాలు నిర్వహించాలి. వీటిలో దాదాపు 12000 జంతువులను ఉపయోగిస్తారు.

వందల ఏళ్ల క్రితమే జంతువులపై పరిశోధనలు మొదలైనా వైజ్ఞానికంగా ఎలాంటి విశ్వాసం పొందని ఈ ప్రక్రియ 1930లో తిరిగి ప్రారంభమైంది.

లక్షల కొద్దీ జంతువులపై షాంపు, కండీషనర్, క్లెన్సర్ వంటి సౌందర్య సాధనాల ప్రయోగాలు వికటించి అవి తమ సహజ లక్షణాలను కోల్పోతున్నాయి. మరికొన్ని అంధత్వానికి గురవుతున్నాయి.

జంతువులకు తీవ్రమైన నొప్పి కలిగించే ప్రయోగాలను వాటిపై నిర్వహించిన తర్వాత నొప్పి నివారిణి మందులను ఇవ్వకుండా వాటిని బోనుల్లో బంధించేస్తుంటారు. వీటిపై తీవ్ర విమర్శలు, ఉద్యమాలు లేవనెత్తారు జంతు ప్రేమికులు.

అమెరికాలో ఇలా ప్రయోగాలు జరిపే జంతువుల లెక్కల్లో 90 శాతం గణాంకాల్ని తప్పిస్తున్నారనే విమర్శ ఉంది. ఓ రకంగా ఇవన్నీ కూడా అక్రమ రవాణా ద్వారా ల్యాబ్‌లకు తరలించేవే. వీటి సంఖ్య కోట్లలోనే ఉంటుంది. అంటే పరోక్షంగా స్మగ్లింగ్ మాఫియాలతో వీళ్లు కలిసి పనిచేస్తున్నారనే భావన కలుగుతుంది.

క్యాన్సర్ కారక పదార్థాల ప్రయోగాలపుడు జంతువులకు రెండేళ్ల పాటు ప్రతి రోజు ఇస్తారు. మరికొన్ని ప్రయోగాల్లో గర్భంతో ఉన్న జంతువులను హతమార్చి వాటి పిండాలను తీసి ప్రయోగాలు చేస్తుంటారు.



మూవీల్లోకి ప్రయాణం

టి.వి. సీరియల్స్, సినిమాలపై కొందరి వీరాభిమానానికి కొలతలు, కొలమానాలుండవు. కానీ ఈ ఫ్యాన్ గర్ల్స్ అభిమానాన్ని చూపించే పద్ధతిలో మాత్రం వేరొకరు పోటీకి రారేమో. ఎందుకంటే మూవీ లొకేషన్లతో రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని సాహసవంతమైన యాత్రలు చేయడమే కాదు అక్కడ చిత్రీకరించిన సన్నివేశాల్ని ఫొటోల్లో బంధిస్తూ ప్రత్యేకంగా అభిమానాన్ని చాటుతున్నారు.

సినిమా, పాపులర్ టీవీ షో, గేమ్ వరల్డ్‌లను చిత్రీకరించిన ప్రదేశాలకు తిరగాలంటే చాలా సమాచారం సేకరించాలి. అందుకు తగ్గట్టుగా చాలా ప్లానింగే చేసుకోవాలి. ఫిన్‌ల్యాండ్‌కు చెందిన టీయా ఒహ్మాన్ (25), సాటు వాల్డెన్(26)లకు ఇలాంటి యాత్రలంటే మక్కువ. సినిమా దృశ్యాల ఫొటోల్ని ముందుగా ఐ-ప్యాడ్‌లోనో, ట్యాబ్‌లోనో ఉంచి యాత్ర ప్రారంభిస్తారు. అక్కడికి చేరుకున్నాక తమ కెమేరాలో వాటిని క్యాప్చర్ చేసి పాత చిత్రాలు వాటిలో ఇమిడిపోయేలా ఫొటో ఫ్రేమింగ్ చేస్తారు. కాస్త రిక్రియేషన్ ఫొటోగ్రఫీ పోలినట్టుండే ఈ కళలో వారి బాగా పండిపోయారు. ఈ ఇద్దరు యువతులూ ఖాళీ సమయాల్లో సినిమా లొకేషన్‌లపై రీసెర్చ్ చేసేస్తుంటారు. నచ్చిన సినిమాల్లోని వింత గొలిపే ప్రాంతాలను ఎంపిక చేసుకుని వాటికి చేరుకునే రూట్ మ్యాప్‌ని సిద్ధం చేసుకోవడంతో మొదలౌతుంది వీరి కసరత్తు. అందమైన భవనాలు, గగుర్పాటుకు గురిచేసే అడవిలోని మార్గాలు, ఎడారి ప్రదేశాలు, అందమైన వనాలు, రాజుల కాలం నాటి కోటల చుట్టూ చిత్రించిన సినిమా సన్నివేశాల్లోని లొకేషన్స్‌ని తమ ఐప్యాడ్‌లో బంధించేందుకు సాహసాలు చేయడానికి కూడా వెనుకాడరు. వందల మైళ్లు కాలి నడకను కూడా లెక్క చేయకుండా సాగిపోతుంటుంది వీరి ప్రయాణం. టి.వి సీరియళ్లు, సినిమాలపై తమకున్న అభిమానం అలాంటిది మరి. వాటిని చిత్రీకరించిన ప్రదేశాలను వెదికి పట్టుకునేందుకు మొదలైన వీరిద్దరి అనుబంధం వారికి తెలీకుండానే ఇద్దరి మధ్యా మంచి స్నేహాన్ని బలపరిచింది. ఒక్కో ప్రయాణంతో స్నేహ బంధాన్ని బలపరుచుకుంటూ వారు వేసిన తొలి అడుగులు తొలుత బ్రిటన్‌లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమయినా తర్వాత మైళ్ల కొద్దీ సాగిన అడుగులు ఆ నగరం మొత్తాన్నీ చుట్టొచ్చేలా చేశాయి. ఇప్పుడు వారు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో చిత్రీకరించిన వివిధ చిత్రాల్లోని సీన్లను రివైండ్ చేసుకుని మరీ యాత్రకు ప్లానింగ్ చేసుకుంటున్నారు. అనుకున్న ప్రదేశాలకు చేరుకోవడం పరిశీలన పూర్తి చేసుకుని ఆ దృశ్యాలను తమ ట్యాబ్‌లలో బంధించడం సీరియస్ హాబీయే. ఇన్‌స్టాగ్రామ్‌లో తమ మిత్రులు, ఫాలోవర్ల కోసం ఉంచిన ఫొటోలకు మంచి క్రేజ్ లభించడంతో ఇప్పుడు వారికీ సాహసయాత్రలు రెట్టింపు థ్రిల్‌ను ఇస్తున్నాయి. తమ టేస్ట్‌కి తగ్గట్టు లొకేషన్లను ఛేంజ్ చేసుకుంటున్నారు.

బ్లాక్‌బస్టర్ రూట్‌లు

హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రాలు హ్యారీ పోటర్, లెస్ మిజరబుల్స్, వార్‌హార్స్ వంటి చిత్రాల్లోని లొకేషన్లకు తన ఫొటోగ్రఫీతో కొత్త కోణాన్ని ఇస్తున్నారు టీయా ఒహ్మాన్. తనో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అంత కంటే తనో గ్రాఫిక్ డిజైనర్, ప్రొఫెషనల్

ఫోటోగ్రాఫర్. ఫోటోగ్రఫీ, యాత్రలపై ఆసక్తి కనబరిచే వారి కోసం తను యేర్పాటు చేసిన 'ఫ్యాన్ గర్ల్ క్వెస్ట్' అనే బ్లాగ్‌కి సంబంధించిన విజువల్స్ (దృశాలన్నిటినీ) ఒహ్మాన్ అందిస్తారు. ఆమె ఓ మంచి ఫోటోగ్రాఫర్ ఆ విషయాన్నె వాటిని వీక్షించిన వారికి కళ్లకు కట్టినట్టు చేస్తాయి. భారత్‌లోను సూపర్ ఫ్యాన్స్‌ను సొంతం చేసుకున్న ఇంగ్లిష్ ప్రీమియర్ సీరియల్స్ 'డాక్టర్ హు', 'షెర్‌లాక్', 'మెర్లిన్'లోని దృశ్యాలను కూడా ఫోటోఫ్రేముల్లో బంధించారు. ఇక సాటు వాల్డెన్ ఆ ప్రయాణాలను ప్లాన్ చేయడంలో మంచి ఎక్స్‌పర్ట్. తమ బ్లాగ్‌లో వారు చుట్టొచ్చిన ప్రదేశాలపై పొందుపరిచే వివరాలు, యాత్రకు సంబంధించిన ప్రదేశాలను ముందుగా డిసైడ్ చేస్తారు సాటు. బ్లాగ్‌ని ఎంత చక్కగా తీర్చి దిద్దుతుంతో అంతే పక్కాగా ఉంటుంది తన టూర్ ప్లానింగ్. రోడ్డు ప్రయాణాల్లో అవసరమయ్యే వస్తువులు, కారడవులను చేరుకోడానికి మార్గాలు, అనుకున్న చోటుకి విమానాల్లో వాలిపోయేందుకు కావాల్సిన అనుమతులు అన్నీ చూసుకునేది సాటునే. రెండు విభిన్న రంగాల్లో తర్ఫీదు పొంది ఇద్దరూ తమని తాము మలుచుకుంటూ నిష్ణాతులుగా మారుతున్న ఈ యువతుల కలయిక ఇప్పుడు 'సీన్ ఫ్రేమింగ్' అనే కొత్త హాబీకి తెరతీసింది. ప్రపంచంలోని వింతలను, విచిత్రాలను వీక్షించాలని అనుకునే వారిలానే ఈ ఇద్దరు యాత్రా పిపాసులు, కళా ఔత్సాహికులు కూడా సినిమాలు, సీరియల్స్‌లో చిత్రీకరించిన ప్రదేశాలైతే రొటీన్ యాత్రలకు భిన్నంగా ఉంటా యని సరదాగా కొన్ని టూర్లు మొదలెట్టారు. ఆ సరదానే ఇప్పుడు వారి జీవితం అయ్యిపోయింది.

ఇదే ప్లానింగ్..

ముందుగా అనుకున్న ప్రదేశాలకు చేరుకుని ఆ అందమైన లొకేషన్లను వెతికి పట్టుకునే పనిలో ఇద్దరూ నిమగ్నమౌతారు. కరెక్ట్ లొకేషన్‌కి చేరుకోగానే అక్కడ చిత్రీకరించిన సన్నివేశాలు గుర్తొస్తాయి. ఇక వాటి తాలూకు జ్ఞాపకాలుగా కొత్త ఫోటోలు వాటి బ్యాక్‌గ్రౌండ్‌గా వారి ఐ-ఫోన్లల్లోని ఫోటో ఫ్రేముల్లో చిక్కుకుంటాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించిన 'హ్యారీపోటర్ అండ్ ది చాంబర్ ఆఫ్ సీక్రెట్స్' సినిమాలోని ఊహా నగరం 'గోతిక్' నిర్మాణ నేపథ్యాలు, 'ది హాలో క్రౌన్' సీరియల్ సన్నివేశాలు చిత్రీకరించిన ప్రదేశాలను అంతే అందంగా తమ ఐఫోన్లలో బంధించారు. బ్రిటన్‌లోని అబే చర్చిలో గోతిక్ అందమైన నిర్మాణాల మధ్య రూపుదిద్దుకున్నాయి 'హ్యారీపోటర్ అండ్ ది ఛాంబర్ ఆఫ్ సీక్రెట్స్' సన్నివేశాలు. అమెరికాలో 1950 నాటి రెస్టారెంట్ ట్రెండ్ (ఎరుపు రంగులో ఉండే కాడిలాక్ ఫర్నీచర్, రాక్ అండ్ రోల్ మ్యూజిక్) ఉట్టిపడేలా నిర్మించిన ఈడీస్ డిన్నర్







రెస్టారెంట్‌లో 'డాక్టర్ హు' సీరియల్‌కి సంబంధించి కొన్ని సన్నివేశాలను

నటులు మ్యాట్ స్మిత్, కరెన్ గిల్లాన్‌లపై చిత్రీకరించారు. టీయా ఒహ్మాన్ 2013లో తన బ్లాగ్ 'ఫ్యాన్‌గర్ల్ క్వెస్ట్' కోసం ఈడీస్ రెస్టారెంట్‌కి చేరుకున్నారు. అక్కడి నుండి తన ప్రయాణం గ్లోస్టర్‌షైర్ అడవుల దిశగా సాగింది. అక్కడ తన అన్వేషణ అంతా ఊహాజనిత సాహసాలతో రూపుదిద్దుకున్న 'మెర్లిన్' టీవీ సీరియల్ లొకేషన్స్ కోసమే. వాటిని వెతికి పట్టుకుని ఐఫోన్‌లో స్పాట్‌లో లొకేషన్స్‌ని క్యాప్చర్ చేయడానికి తనకి ఎక్కువ సమయం పట్టలేదు. అక్కడి నుండి వేల్స్ నగరంలోని ఫారెస్ట్ ఫార్ కంట్రీ పార్క్‌లోని 'త్రీ బేర్స్' గుహలోకి అడుగుపెట్టింది. ఇనుప ఖనిజం ఎక్కువగా లభించే ఈ ప్రాంతం ప్రకృతి అందాలకూ ఆనవాలుగా ఉండటంతో ఇక్కడ

షూటింగ్‌లు తరచూ జరుగుతుంటాయి. అక్కడి పొదరిళ్లు, సీరియల్స్‌కి లొకేషన్స్‌గా మారిన కొన్ని ప్రదేశాలతోపాటు, లండన్‌లోని సెయింట్ బర్తలోమెవ్స్ హాస్పిటల్లో 'షెర్లాక్' టీవీ షో కోసం నటుడు బెనెడిక్ట్ కంబర్‌బ్యాచ్‌పై చిత్రీకరించిన సన్నివేశాల లొకేషన్లనూ ఐఫోన్‌లో బంధించింది. ఇంగ్లాండ్‌లోని 'పజిల్‌ఉడ్' దట్టమైన అడవులుండే ప్రాంతం. ఈ అడవుల్లో మార్గాలు కూడా గజిబిజిగానే ఉంటాయి. పర్యాటక ప్రదేశంగా పేరొందిన ఈ అటవీ ప్రాంతంలోనే మెర్లిన్ సీరియల్ షూటింగ్ జరిగింది. బ్రాడ్లీ జేమ్స్‌పై అక్కడ చిత్రీకరించిన ఫైట్లు, కొత్తదారులు వెతుక్కుంటూ సాహసోపేతంగా వారు నడిచిన బాటలన్నీ ఒహ్మాన్‌ను ఎంతగానో ఆకర్షించాయి. అప్పటి నేపథ్య ప్రదేశాలు ఇప్పుడు మొయిన్ ఫ్రేమ్‌గా మారడంతో ఈ ఫోటోలకూ ఆదరణ పెరిగింది. సెయింట్ బర్తలోమెవ్స్ హాస్పిటల్ పైనుంచి షెర్లాక్ సీరియల్‌లో జాన్ కిందకి దూకిన ప్రదేశం ఒకటైతే, బెనెడిక్ట్ కంబర్‌బ్యాచ్ (జేమ్స్)పై 'థర్డ్ స్టార్' సినిమా కోసం పెంబ్రోక్‌షైర్ దగ్గరలోని బరాఫన్‌డిల్ సముద్ర తీరంలో చిత్రీకరించిన సన్నివేశాల తాలూకు జ్ఞాపకాలు మరికొన్ని. అన్నిటినీ తన ఐప్యాడ్‌తో బంధించి చిట్టిఫ్రేముల్లో చిత్రీకరించారు.

ఆసక్తికరమైన విషయాలతో వీరిద్దరూ నడుపుతున్న బ్లాగ్‌లో ఉంచిన ఫోటోల వెనుక దాగున్న ప్రదేశాలు ఏ టీవీ షో లేదా సినిమాలో కనిపించాయో గుర్తించే ఈ వెబ్‌సైట్ వీక్షకులు వేల సంఖ్యలో ఉన్నారంటే ఎంత పెద్ద హిట్టయ్యాయో అర్థమవుతుంది. ఐ-ఫోన్లో వారు బంధించే చిత్రాలు అందంగా ఉండాలంటే ముందు అందమైన ప్రదేశాలను ఎంచుకోవాలి. ఆ ప్రదేశాలు అందరికీ పరిచయమైనవైతే కొంత బోర్ ఫీలవుతారు. అందుకే ఎక్కువ మందికి తెలీని లొకేషన్స్ దిశగా వారు వేసిన అడుగులు ఇప్పుడు వారికి ఆనందంతోపాటు మంచి గుర్తింపుని కూడా తెచ్చిపెట్టాయి.

- శర్వాణి

దెయ్యం

గోనుగుంట మురళీకృష్ణ
9701260448

కథ

గేటుకి తగిలించిన "టులెట్" బోర్డు చూడగానే స్కూటీ ఆపింది నందిని. గేటుకి ఉన్న చిన్న తలుపు తెరుచుకుని లోపలికి వచ్చింది. అక్కడ పూల మొక్కలకు నీళ్ళు పోస్తున్న అమ్మాయి నందినిని చూడగానే ఎవరు కావాలండీ? అని అడిగింది.

"బయట "టు లెట్ బోర్డు చూసి ఇల్లు అద్దెకు ఇస్తారేమో అని అడగటానికి వచ్చాను" అన్నది నందిని.

"మీరేం చేస్తుంటారు" అడిగింది ఆ అమ్మాయి.

"ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను"

" ఎవరెవరు ఉంటారు?"

"నేను మా నాన్న గారు ఉంటాం. ఆయన కూరగాయల వ్యాపారం చేస్తారు. ఇంకా మా అన్నయ్య కూడా ఉన్నాడు. కానీ హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. అప్పుడప్పుడు వస్తూంటాడు"

"అలాగే! ఇల్లు చూద్దురు గాని రండి" పిలిచింది ఆ అమ్మాయి. ఊ అని ఆమెను అనుసరించింది నందిని పైన మేడ మీద నేను, మా పేరెంట్స్ ఉంటాం. కింద పోర్షన్ అద్దెకు ఇవ్వాలనుకుంటున్నాము. నడుస్తూ చెప్పింది.

కింద పోర్షన్ తలుపుకు గడియపెట్టి ఉంది. తాళం వేసిలేదు.తలుపు తెరిచి లోపలికి వచ్చారు ఇద్దరు. పెద్ద హాలు, పక్కన రెండు బెడ్ రూంలు. వెనుక కిచెన్ ఉన్నాయి. ఇంటి చుట్టూ నడవటానికి కొంత మేర బండలు పరిచి ఉన్నాయి. ప్రహరీ లోపలి ఇంకా చాలా ఖాళీ స్థలం ఉన్నది. అక్కడ అంతా మామిడి చెట్లు, జామ చెట్లు, అరటి చెట్లు పూల మొక్కలు ఉన్నాయి.

"బావిలో నీళ్ళు స్నానానికీ వాడుకోవచ్చు. తాగడానికి మున్సిపల్ ట్యాప్ వస్తుంది. చెప్పింది ఆ అమ్మాయి"

నందిని సంతృప్తిగా చూస్తూ " అద్దె ఎంత?" అని అడిగింది. ఆమె చెప్పిన సంఖ్య వినగానే "అంత తక్కువా" అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది. అది గ్రహించినట్లు ఆ అమ్మాయి "మాకు అద్దె ముఖ్యం కాదండి! మనుషులు మంచి వాళ్ళు అయి ఉండాలి. మా అమ్మా నాన్న పెద్దవాళ్ళు అయిపోయారు. మాకు తోడుగా ఉంటూ మంచిగా ఉండేవాళ్ళు రావాలని అనుకుంటున్నాం" అన్నది.

"సరే ! రేపే ఇంట్లోకి వస్తాము" అంది నందిని.

"మీ ఇష్టం"

" మీ తల్లిదండ్రులను అడగవలసిన పని లేదా!' సందేహంగా అడిగింది నందిని.

" అవసరం లేదు. వాళ్ళు నా మాట కాదనరు"

" ఓ.కే. నా పేరు నందిని. మీ పేరేమిటి?

శైలజ'

బయటికి వచ్చి తలుపు గడియ వేస్తూండగా " మీరేం చదువుతున్నారు" అని అడిగింది నందిని.

"డిగ్రీ పూర్తయింది. నాకైతే ఉద్యోగం చేయాలని ఉంది. కానీ నేను ఉద్యోగానికి వెళితే మా పేరెంట్స్‌ని చూసుకునే వాళ్ళు ఎవరూ లేరు. అందుకే అలాంటి ప్రయత్నాలేమీ చేయలేదు" చెప్పింది శైలజ.

నందిని శైలజకు వెళుతున్నానని చెప్పి స్కూటీ స్టార్ట్ చేసి వెళ్ళి పోయింది. ఆ మర్నాడు నందిని, ఆమె తండ్రి సుందరరామయ్య ఇంట్లోకి అద్దెకు దిగారు. నందిని సామాను పుస్తకాలు అన్నీ సర్దుతూ సంతృప్తిగా చూసింది. ఊరి చివరి ప్రదేశం కావటం వల్ల వాహనాల రణగొణ ధ్వనులు లేవు. పైగా పచ్చటి చెట్లు, చల్లటి గాలి, ప్రశాంతమైన వాతావారణం. మనిషి ఏకాగ్రతను పదింతలు పెంచే నిశ్శబ్దం. అప్పుడప్పుడు పక్షుల కువకువలు రెక్కల చప్పుళ్ళ తప్ప మరే శబ్దాలు లేవు. వరండాలో కుర్చీవేసుకుని కూర్చుని హాయిగా చదువుకోవచ్చు అనుకుంది.

శైలజ నందినిని సుందరరామయ్యను మేడపైకి తీసుకువెళ్ళి తల్లిదండ్రులకు పరిచయం చేసింది. శైలజ తల్లిదండ్రులిద్దరికీ దాదాపు అరవై ఏళ్ళ వయసు ఉంటుంది. ఇద్దరి మంచాలకి మధ్య గుండ్రటి స్టూల్ ఉంది. స్టూల్ మీద ఏవో టాబ్లెట్లు, టానిక్ సీసాలు, వాటర్ బాటిల్, గ్లాసులు ఉన్నాయి. ఎదురుగా టి.వి. ఉన్నది. శైలజ వాళ్ళ అమ్మ టి.వి చూస్తుంటే ఆయన పేపర్ చదువుతూ ఉన్నాడు.

"నాకు గుండె జబ్బు, ఆయనకి కీళ్ళనొప్పులు. మెట్లు దిగిరాలేము. కావలసినవన్నీ అమ్మాయే చేసిపెడుతుంది." అన్నది వాళ్ళమ్మ.

సుందరరామయ్య నందిని సానుభూతిగా చూశారు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత ఇద్దరూ కిందికి దిగివచ్చారు. సుందరరామయ్య కూరగాయల బండి నడుపుతూ వీధి వీధీ తిరిగి అమ్ముతూ ఉంటాడు. నందినికి తండ్రి పడే కష్టం తెలుసు. త్వరగా చదువు ముగించి ఏదైనా జాబ్ చేసుకుని తండ్రికి ఆసరాగా ఉండాలని ఆమె ఆలోచన. ఆమె అన్నయ్య హైదరాబాద్‌లో జాబ్ చేస్తూ ఆమె కాలేజ్ ఫీజులకీ ఖర్చులకీ కొంత పంపుతూ ఉంటాడు.

ఆ రోజు నందిని కాలేజీకి బయలు దేరుతూ స్కూటీ తీసుకుని గేటు వేసి రోడ్డు మీదకు వచ్చింది. వీధి కుళాయిలో బిందెలతో నీళ్ళు పట్టుకుంటున్న ఆడవాళ్ళు నందినిని చూసి గుసగుసలాడుకున్నారు.

"అమ్మాయ్! ఆ ఇంట్లోకి

అద్దెకు దిగింది మీరేనా! అని అడిగింది ఒకామె.

"అవునండీ! అన్నది నందిని.

" కూరగాయల బండి మీద అమ్ముతూ వెళ్ళే ఆయన కూతురివా?"

"ఊ"

" ఆ దెయ్యాల కొంపలోకి ఎందుకు వచ్చారమ్మా? చాలా కాలం నుంచే ఆ ఇల్లు ఖాళీగా పడి ఉంటున్నది. ఆ ఇంటి సంగతి తెలిసిన వాళ్ళు ఎవరూ రారు."

" ఈ రోజుల్లో కూడా ఇంకా దెయ్యాలు, భూతాలు ఏమిటండీ? అవన్నీ మూఢ నమ్మకాలు" నందిని నవ్వి బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయింది.

ఆ ఇంట్లోకి నందిని వాళ్ళు వచ్చి పదిరోజులైంది. శైలజ కలుపుగోలుగా ఉన్నందుకు నందిని సంతోషించింది.

ఆ రోజు సాయంత్రం నందిని కాలేజీ నుంచి ఇంటికి వచ్చి పనంతా ముగించుకుని స్నానం చేయటానికి బాత్ రూంకి వెళ్ళింది. చీకటి పడింది చుట్టూతా చెట్లు ఉండడం వల్ల ఇంకా చీకటిగా ఉంది. స్నానం చేసి టవల్ చుట్టుకుని బయటకు వచ్చేసరికి ఎదురుగా చెట్లల్లో నుంచీ నల్లటి ముసుగు కప్పుకుని ఉన్న ఆకారం ఇటు వైపే చూస్తోంది. కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. నందిని గుండె ఝల్లుమంది "ఎవరది"? అన్నది పెద్దగా. ప్రహరీ గోడ వెంబడే కరివేపాకు పొదలు దట్టంగా ఉన్నాయి.

" ఎవరంటే మాట్లాడరే?" అరిచింది మళ్ళీ. ఆకారం చెట్ల వెనుక పరుగెత్తుతున్నట్లు చెట్లు కదిలాయి. నందిని వడివడిగా ఇంట్లోకి వచ్చేసింది. బట్టలు కట్టుకుని జడవేసుకుంటూ ఆ విషయమే ఆలోచించసాగింది.

సుందరరామయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. స్నానం చేసి వచ్చి భోజనానికి కూర్చున్నాడు. నందిని తండ్రికి వడ్డిస్తూ ఇందాక జరిగిన సంఘటన అంత క్రితం కుళాయి దగ్గర ఆడవాళ్ళు అన్నమాటలు చెప్పింది.

"దెయ్యం పేరు చెప్పి ఎవడైనా దొంగ వెధవ మాటు వేశాడేమో! ఇంటి వాళ్ళను తోడు చేసుకుని జాగ్రత్తగా ఉండమ్మా!" అన్నాడు సుందరరామయ్య.

"అలాగే నాన్నా" అన్నది.

ఎండాకాలం అవటం వల్ల కరెంటు కోత ఎక్కువగా ఉంది.

ఫ్యాన్ లేకపోతే ఇంట్లో ఉక్కగా ఉంటుంది. అందువల్ల తండ్రీ కూతుళ్ళిద్దరూ ఆరుబైట పడుకుంటున్నారు. బయట చల్లటి గాలి వీస్తూంటుంది. సాధారణంగా ఒకసారి నిద్ర మొదలు పెడితే తెల్లవారే వరకు మెలకువ రాదు నందినికి. ఆ రోజు అలజడి చెందిన మనసుతో ఉండటం వల్ల మధ్య మధ్యలో మెలకువ వస్తూంది. ఓ అర్ధరాత్రి వేళ ముఖం మీద వెచ్చటి ఆవిరి, ఊపిరి వదులుతున్నట్లు ఉచ్ఛ్వాస,నిశ్వాసాలు వినపడే సరికి కళ్ళు తెరిచి చూసింది నందిని. నల్లటి ముసుగు వేసుకున్న ఆకారం నందిని మంచం మీద కూర్చుని, ముఖంలో ముఖం పెట్టి చూస్తోంది. కళ్ళు నిప్పు కణికల్లాగా ఉన్నాయి. నందిని ఉలిక్కిపడి కెవ్వున అరిచింది. ఆకారం గభాలున పరుగెత్తి ఇంటికి, ప్రహరీకి మధ్య ఉన్న సందులోకి వెళ్ళిపోయింది.

నందిని అరుపుకి సుందరరామయ్య కూడా ఉలిక్కిపడి లేచాడు. నందిని చిగురుటాకులా వణికిపోతున్నది. "నాన్నా ! దెయ్యం...దెయ్యం నా ముఖంలో ముఖం పెట్టి చూస్తోంది" అన్నది వణికిపోతూ..

"దెయ్యమా!" నిర్ఘాంతపోయాడు. "ఉండు చూడని"! లేవబోయాడు." వద్దు...వద్దు నాకు భయంగా ఉంది." తండ్రి చెయ్యి పట్టుకుని అన్నది.

"ఉండమ్మా! నేను వెళ్ళి చూసి వస్తాను" చెయ్యి విడిపించుకుని సందు దగ్గరికి వెళ్ళాడు. అక్కడ ఎవరూ లేరు. చీకటి, నిశ్శబ్దం.

"నాకు భయంగా ఉంది. ఇంట్లోకి వెళదాం నాన్నా!"

"పద తల్లీ! నందిని భుజం చుట్టూ చెయ్యివేసి లోపలికి నడిపించాడు. "నువ్వు కూడా ఇక్కడే పడుకో నాన్నా? చాపమీద పడుకుంటూ అన్నది. " అలాగే! ఇక్కడే ఉంటాను. భయం లేదు. నిద్రపో అనునయంగా మీద చెయ్యి వేస్తూ అన్నాడు. నందిని కళ్ళు మూసుకుంది.

తెల్లవారే సరికి నందిని ఒళ్ళు సలసలా కాగిపోతోంది. శైలజ వచ్చి పలకరించింది. సుందరరామయ్య రాత్రి జరిగిన సంఘటన చెప్పాడు.

"మాకు ఎటువంటి శబ్దాలు వినిపించలేదు బాబాయ్! మా అమ్మకు నిద్రపట్టక అప్పుడప్పుడు అర్ధరాత్రి వేళ కూర్చుని టి.వి చూస్తుంటుంది. అలాంటిదేమైనా ఉంటే చెప్పేది కదా? అన్నది.

సుందరరామయ్య శైలజను నందినికి తోడుగా కూర్చోబెట్టి డాక్టర్‌ను పిలుచుకు వచ్చాడు. డాక్టర్ పరీక్ష చేసి "దడుపు జ్వరం. కంగారు పడాల్సింది ఏమీ లేదు. తగ్గిపోతుంది" అని మందులు రాసిచ్చి వెళ్ళిపోయాడు. శైలజ నందిని కోసం జావ కాసి ఇచ్చింది. మీరేమీ వంట పని పెట్టుకోకండి బాబాయ్! మీకు భోజనం తెచ్చి ఇస్తాను" అన్నది. శైలజ చేదోడు వాదోడుగా ఉండడం చాలా కృతజ్ఞతగా అనిపించింది సుందరరామయ్యకు.

నాలుగు రోజులకి నందిని జ్వరం తగ్గు ముఖం పట్టింది. కొద్దిగా లేచి అటూ ఇటూ తిరుగుతూ ఉన్నది. చీకటి పడితే బయటకు వెళ్ళడానికి హడలిపోతున్నది. కరెంటు పోయి ఎంత ఉక్కగా ఉన్నా గది విడిచి రావటానికి ఇష్టపడడం లేదు.

రాత్రి పూట సుందరరామయ్య కూడా ఒళ్ళు మరచి నిద్రపోకుండా అప్పుడప్పుడూ మెల్కువగా ఉండసాగాడు. ఒకరోజు అర్ధరాత్రి నందినికి దాహంతో నోరు ఎండిపోయినట్లయి మెలకువ వచ్చింది. మంచి నీళ్ళ కోసం లేచి నిలబడిన నందినికి ఎదురుగా కిటికీ బయట ఆకారం నిలబడి లోపలికి చూస్తున్నట్టు కనిపించింది. చీకట్లో కూడా కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. నందిని వెన్నులో నుంచీ చలి జరజర పాకింది. "నాన్నా?" అని పెద్దగా అరిచింది. గభాలున కళ్ళు తెరిచిన సుందరరామయ్యకు కూడా ఆకారం చటుక్కున పక్కకు తప్పుకోవటం కనిపించింది. ఆయన లేచి తలుపు తెరవబోయాడు. "వద్దు నాన్నా! బయటకు వెళ్ళొద్దు" భయంగా అన్నది.

"ఉండమ్మా! చూసి వస్తాను" ఆయన కర్ర తీసుకుని బయటకు వచ్చి చూశాడు. అక్కడ ఎవరూ కనిపించలేదు. కొంచెం సేపటి తర్వాత లోపలికి వచ్చాడు.

"మనం వెంటనే ఇల్లు ఖాళీ చేసి ఇంకెక్కడికైనా వెళ్ళిపోదాం నాన్నా!" అన్నది నందిని వణుకుతూ

"సరే! అలాగే చేద్దాం. నువ్వు పడుకో!" అన్నాడు. "ఆ కిటికీ తలుపులు వేసెయ్" అన్నది సుందరరామయ్య కిటికీ తలుపులు మూసి వచ్చాడు.

కొద్దిసేపటికి నందిని నిద్రపోయింది. సుందరరామయ్య ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎవరైనా దొంగతనం చేయాలని ప్రయత్నిస్తున్నారా? తన ఇంట్లో నగలు, నాణేలు ఏమున్నాయి? పేదవాళ్ళు. అయినా పాతకాలపు ఇల్లు. తలుపులు విరగ్గొట్టాలన్నా, కిటికీ చువ్వలు వంచాలన్నా ఎంతసేపు? అనుకున్నాడు.

తెల్లవారింది. సుందరరామయ్య. కొడుక్కి ఫోను చేశాడు. అతని పేరు గౌతమ్. తండ్రి చెప్పినదంతా విని. "నువ్వు ఊహించినట్లు దొంగే అయి ఉంటాడు నాన్నా! ఆ ఊళ్ళో నా చిన్ననాటి స్నేహితుడు పోలీస్ డిపార్ట్‌మెంట్లో ఎస్.ఐ.గా పని చేస్తున్నాడు. వాడి సాయం తీసుకుని ఇదేమిటో తేల్చివేస్తాను. రేపే బయలు దేరి వస్తాను. చెల్లాయిని ధైర్యంగా ఉండమని చెప్పు" అన్నాడు.

ఆ మర్నాడు గౌతమ్ వచ్చేశాడు. అన్నగారిని చూడగానే నందినికి ధైర్యం వచ్చింది. జ్వరం, భయం తాత్కాలికంగా మర్చిపోయి అతనికి కాఫీ కలపడానికి వంట గదిలోకి వెళ్ళింది.

"నేను వచ్చినట్టు ఎవరికి తెలియనీయవద్దు. ఈ రోజు రాత్రి మనిద్దరం ఆరు బయట పడుకుందాం చెల్లాయిని లోపల పడుకోమను. అన్నాడు గౌతమ్ తండ్రితో. సుందరరామయ్య సరేనన్నాడు.

గౌతమ్, సుందరరామయ్య ఆరు బయట మంచాలు వేసుకుని పడుకున్నారు. సుందరరామయ్య నిద్రపోయాడు. గౌతమ్ కావాలనే తల వరకు ముసుగు కప్పుకుని పడుకున్నాడు. మెలకువగా ఉండి వేచి చూడసాగాడు. ఒక రాత్రి వేళ ఎవరో నడిచి వస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది. అడుగుల శబ్దం దగ్గరైంది. గౌతమ్‌కి

మంచం పట్టి మీద ఎవరో కూర్చున్నట్లు అనిపించింది. తల మీద ముసుగు లాగబోయారు. గౌతమ్ ముసుగు బిగించి పట్టుకున్నాడు. ముసుగు గట్టిగా లాగబోయారు. గౌతమ్ గభాలున ముగుసు తీసి ఆ చెయ్యి వడిసి పట్టుకున్నాడు. నల్లటి ముసుగు వేసుకున్న ఆకారం అతని చెయ్యి వదిలించుకుని పారిపోబోయింది. గౌతమ్ లేచి గట్టిగా పట్టుకుని "నాన్నా! నాన్నా!" అని అరిచాడు. సుందరరామయ్య గభాలున లేచాడు. గౌతమ్ ముసుగు మనిషి పెనుగులాడటం కనిపించింది. పరుగెత్తుకుని వెళ్ళి లైటు వేశాడు. గౌతమ్ ఆకారం మొహం మీద ముసుగు లాగేశాడు. ఆమె శైలజ. "వదులు..వదులు.." అని గింజుకుంది. కానీ గౌతమ్ ఉడుం పట్టు నుంచి విడిపించుకోలేక కసిగా అతని చెయ్యి మీద మణి కట్టు దగ్గర కొరికింది. " అబ్బా! " అని అరిచాడు గౌతమ్. కానీ వదిలిపెట్టలేదు. ఇద్దరూ ఆమెను లాక్కుని వచ్చి లోపలికి తీసుకుని వచ్చారు. నందినికి మెలకువ వచ్చి లేచి నిలబడింది.

గౌతమ్, సుందరరామయ్య కలిసి శైలజను గదిలోకి నెట్టి తలుపు వేశారు. ఇంత గలాటా జరుగుతున్నా. శైలజ తల్లి కానీ తండ్రి కానీ రాకపోవడం ఆశ్చర్యం కలిగించింది. కనీసం వారి గదిలో లైట్లు కూడా వెలగలేదు. పగలంతా తనతో అంత స్నేహంగా మంచిగా ఉండే శైలజేనా ఇంత నాటకం ఆడింది?నివ్వెరపోతూ అనుకుంది నందిని.

తెల్లవారింది గౌతమ్, ఎస్.ఐ.గా పని చేస్తున్న తన స్నేహితుడికి ఫోన్ చేశాడు. అతనితో పాటు కానిస్టేబుల్స్ కూడా ఇద్దరు వచ్చారు. ఎస్.ఐ.

"తలుపులు తెరవండి" అన్నాడు. గౌతమ్ తలుపులు తెరిచి చూశాడు. శైలజ గోడకు ఆనుకుని నేల మీద కూర్చుని ఉంది. ముఖం తెల్లగా పాలిపోయి ఉంది. పారిపో యే ప్రయత్నం ఏమి చేయలేదు. పైకి వెళ్ళి సోదా చేయండి" కానిస్టేబుల్స్‌ని ఆదేశించాడు ఎస్.ఐ.

కానిస్టేబుల్స్ పైకి వెళ్ళి వెతికి నల్లటి ముసుగులు రెండు, భయంకరమైన ముఖాలు కలిగిన రకరకాల మాస్క్‌లు తీసుకువచ్చారు. వాటిని స్వాధీనం చేసుకుని "ఆమెను జీప్ ఎక్కించండి" అన్నాడు. ఎస్.ఐ. శైలజ తల్లి దండ్రీ కూడా ముక్కుతూ,మూలుగుతూ మెట్లు దిగి కిందికి వచ్చారు.

" మీ అమ్మాయి చేసే పనులు మీకు తెలుసా?" సూటిగా చూస్తూ ప్రశ్నించాడు ఎస్.ఐ.

"తెలుసు" ముక్త సరిగా అన్నాడు శైలజ తండ్రి.

"ఐ.సీ. అవసరమైతే మీరు కూడా స్టేషన్‌కి రావలసి ఉంటుంది" చెప్పాడు బయలు దేరుతూ..

"థ్యాంక్స్ రా!" గౌతమ్ స్నేహితుడికి షేక్‌హ్యాండ్ ఇస్తూ అన్నాడు.

"ఇట్స్ ఓ.కే. అన్నాడు ఎస్.ఐ

పోలీస్ స్టేషన్‌లో శైలజ తలవంచుకుని నిలబడి ఉన్నది. ఎదురుగా ఎస్.ఐ. గౌతమ్ సుందరరామయ్య, నందిని కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. పక్కన ఇద్దరు కానిస్టేబుల్స్ గుమ్మం దగ్గర ఇద్దరు నిలబడి ఉన్నారు.

శైలజ చెప్పసాగింది. "చిన్నప్పుడు నేను ఎలిమెంటరీ

స్కూల్‌లో చదువుకునే రోజుల్లో సరోజమ్మ అనే టీచర్ ఉండేది. ఆమె చాలా స్ట్రిక్టు పిల్లలు ఏ మాత్రం క్రమశిక్షణ తప్పినా అల్లరి చేసినా కఠినంగా శిక్షించేది. ఆమె చెంపకు పెట్టి కొడితే కళ్ళు బైర్లు కమ్మేవి. నన్ను గట్టిగా తొడ పాశం పెట్టేది. ఆ నొప్పికి గిలగిలలాడి పోయేదాన్ని. ఆమె ఇల్లు, మా ఇల్లు పక్క పక్కనే మా నాన్న గారికి ఫ్యామిలి ఫ్రెండ్ కూడా. అందువల్ల నన్ను కొట్టినా తిట్టినా నాన్న గారు ఆమెను ఏమీ అనేవారు కాదు. నేను రహస్యంగా ఆమె ఇంట్లోకి వెళ్ళికూరల్లో కారం కలిపేదాన్ని.

ఆమె అది తిని ఉక్కిరిబిక్కిరి అవుతుంటే నాలో నేనే సంతోషించే దాన్ని. మా పెంపుడు పిల్లికి ముసుగు కప్పి, రాత్రివేళ కిటికీ లో నుంచి చూపించి జడిపించేదాన్ని. ఆమె జడుసుకుంటే చూసి నవ్వుకునే దాన్ని. ఆమెను డైరెక్ట్‌గా ఎదుర్కోలేని నేను ఇలా చాటుమాటుగా ఏడిపించి సంతోషించేదాన్ని.

వయసు పెరిగిన కొద్ది క్రమక్రమంగా ఆ అలవాటు ఎక్కువ కాసాగింది. కాలేజ్‌లో స్నేహితురాళ్ళు గొడవపెట్టుకుంటే వాళ్ళ పేర్లు అబ్బాయిల పేర్లతో కలిపి కాలేజీ గోడల మీద అసభ్యంగా రాసేదాన్ని. అది చూసి వాళ్ళు తలెత్తుకోలేక బాధపడుతూ ఉంటే చూసి ఆనందించేదాన్ని. నందినిని కూడా అలాగే ఏడిపించి ఆనందించేదాన్ని. కానీ ఆలోచిస్తే ఆమె నాకు ఎటువంటి అపకారం చేయలేదు కదా! పాపం! ఏడిపించడం దేనికి! అనిపించేది. కానీ రాత్రి అయితే చాలు తాగుబోతువాడు వద్దు వద్దు అనుకుంటూనే తాగినట్లు నిగ్రహించుకోలేకపోయేదాన్ని నాకు ఇది ఒక వ్యసనంగా మారిపోయింది. నేను చేసేది తప్పు అని తెలుసు. కానీ నా మనసు మీద నాకు కంట్రోల్ లేదు. ఈ బలహీనత వల్ల స్నేహితులందరూ దూరమైపోయారు. ఒంటరిని అవటం ఇంకా ఉక్రోషం కలిగించింది. నా అలవాటు తెలిసిన వాళ్ళు నన్ను శాడిస్ట్ అని తిట్టేవాళ్ళు నా తలిదండ్రులకు కూడా ఈ విషయం తెలుసు. కానీ వయసు పెరగటం వల్ల వాళ్ళు నన్ను గట్టిగా వారించలేక ఊరకుండిపోయారు. చెప్పడం ముగించి శైలజ వెక్కి వెక్కి ఏడవసాగింది.

గౌతమ్‌కి ఆమెను చూస్తే జాలివేసింది. నందిని కూడా " ఆ ఒక్క బలహీనత తప్పితే శైలజ చాలా స్నేహశీలి నాకు ఎన్నోసార్లు సహాయం చేసింది" అన్నది సానుభూతిగా.

"ఆమె బలహీనత వల్ల ఇలా చేసింది కానీ మా మీద పగలేదుగా! ఆమెను వదిలెయ్యారా! మంచి సైకియాట్రిస్ట్ దగ్గర ట్రీట్‌మెంట్ ఇప్పిద్దాం" అన్నాడు గౌతమ్.

"ఓ.కే. మీ ఇష్టం" అన్నాడు యస్.ఐ.

శైలజని మానసిక వైద్యశాలలో చేర్పించి అందరూ ఇంటికి వచ్చారు. బాబూ మా అమ్మాయి మానసిక స్థితి తెలిసి కూడా మేము నియంత్రించలేక మిమ్మల్ని ఎంతో బాధ పెట్టాం. క్షమించండి అన్నాడు శైలజ తండ్రి. "పర్వాలేదండి" అన్నాడు సుందరరామయ్య

"పూర్తి మానసిక ఆరోగ్యంతో శైలజ తిరిగి రావాలని కోరుకుందాం" అన్నాడు గౌతమ్.

"అవునండీ! శైలజ మా నాన్నని'బాబాయ్" ! అని పిలిచేది. అంటే నేను కూడా మీకు కూతురితో సమానమే! ఆమె వచ్చే దాకా మీకు ఏలోటు రాకుండా చూసుకుంటాను" అన్నది నందిని

శైలజ తల్లిదండ్రుల కళ్ళు చెమ్మగిల్లాయి. కృతజ్ఞతగా చూశాడు.



మిక్స్‌డ్ ఫ్రూట్ సలాడ్



కావాల్సిన పదార్థాలు

దానిమ్మ గింజలు - 1/2 కప్పు
జామకాయ ముక్కలు 1/2 కప్పు
చెర్రీలు- 1 కప్పు
ఖర్జూర - 1/2 కప్పు
నల్ల ద్రాక్ష - 1 కప్పు
పచ్చద్రాక్ష - 1 కప్పు
బొప్పాయి ముక్కలు- 1/2 కప్పు
తేనె- 2 టేబుల్ స్పూన్లు
నిమ్మకాయ రసం - 1/2 కప్పు
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా ఫ్రూట్స్ అన్నిటినీ శుభ్రంగా కడిగి జామకాయ, బొప్పాయిలను చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. ఒక బౌల్‌లో దానిమ్మ , చెర్రీ, నల్ల ద్రాక్ష, పచ్చద్రాక్షలను తీసుకుని కలపాలి. తర్వాత జామ, ఖర్జూరా ముక్కలు వేసి వాటిపై తేనె వేసి బాగా కలపాలి. ఇప్పుడు బొప్పాయి ముక్కలను కూడా చేర్చి ఈ మిశ్రమంపై నిమ్మరసం, ఉప్పు వేసి మరోసారి కలుపుకోవాలి. తేనె నిమ్మరసం కొద్దిగా ముక్కలకు పట్టేలా ఉంచి తర్వాత సర్వ్ చేసుకోవాలి.

వాల్‌నట్స్ ఆపిల్ సలాడ్

కావాల్సిన పదార్థాలు

వాల్‌నట్స్ -1/2 కప్పు
పెరుగు- 1/2 కప్పు
పుదీనా ఆకులు -2 స్పూన్లు
తేనె- 1 టేబుల్ స్పూన్
నిమ్మకాయ - 1
మిరియాల పొడి- తగినంత
ఆపిల్- 2
కిస్‌మిస్ - 1/2 టేబుల్ స్పూన్
నిమ్మరసం - 1/2 స్పూన్

తయారుచేసే విధానం

వాల్‌నట్స్‌ని ముందుగా వేయించి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఒక బౌల్‌లో పెరుగు, తేనె, పార్స్లీ ఆకులు, నిమ్మకాయ రసం, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. ఆపిల్‌ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్‌చేసుకోవాలి. ఈ ముక్కలను పెరుగు, నిమ్మరసం ఉంచిన బౌల్‌లో వేసి బాగా కలుపుకోవాలి. వాటిపై కొద్దిగా నిమ్మరసం చల్లి అతిథులకు అందించండి.

పుచ్చకాయ బొప్పాయ సలాడ్



కావాల్సిన పదార్థాలు

పుచ్చకాయ ముక్కలు -1 కప్పు
బొప్పాయి ముక్కలు- 1కప్పు
ఆపిల్ ముక్కలు -1 కప్పు
ద్రాక్ష పళ్లు - 1/2 కప్పు
దానిమ్మ గింజలు - 1/2 కప్పు
పుదీనా ఆకులు - 1/2 కప్పు
నిమ్మరసం- 1/4 టీ స్పూను
జీలకర్ర - 1/4 టీ స్పూను
సోంపు - 1/4 టీ స్పూను
మిరియాల పొడి- చిటికెడు

తయారుచేసే విధానం

ముందుగా పుచ్చకాయ, బొప్పాయి, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ ఒక బౌల్ తీసుకుని బాగా కలపాలి. తర్వాత కొద్దిగా నిమ్మరసం, పుదీనా ఆకులు వేసి కలుపుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి జీలకర్ర, సోంపును వేయించి పొడిచేసుకోవాలి. జీలకర్ర, సోంపు, మిరియాల పొడిని పుచ్చకాయ ముక్కల మిశ్రమానికి సరిపడా చల్లుకుని మరి కొంచెం నిమ్మరసాన్ని జోడించి బాగా కలిపి పిల్లలకి అందిస్తే ఇష్టంగా తింటారు.



ఎన్నున్నాయి

చింటు వాళ్లింట్లో కొన్ని కుందేలు పిల్లలు దూరి ఎవ్వరికీ దొరక్కుండా అక్కడున్న కొన్ని వస్తువుల్లో దాక్కున్నాయి. మీరు అవి ఎక్కడ దాక్కున్నాయో కనిపెట్టేయండి?

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్... నేను బాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: శ్రుతిహాసన్

ఆకులతో బొమ్మ

పిల్లలూ మీ ఇంటి దగ్గర రాలిపడే పచ్చి, ఎండుటాకులతో ఈగ బొమ్మ ఎలా తయారు చేసుకోవచ్చో ఇక్కడిచ్చాం. మీరూ ప్రయత్నించండి!



చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



ఏ నీడ ఎవరిది

ఇక్కడ కొన్ని జంతువులు వాటి ఎదురుగా నీడలు ఉన్నాయి. వాటిలో ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి జత చేయండి.



మంచు చేపలు

పిల్లలూ చేపల్లో వంజరం, సాల్మన్ చేప, సొర చేప ఇలా రకరకాల చేపల పేర్లను మీరు వినే ఉంటారు. ఐస్ ఫిష్ అనే ఓ చేప ఉందని మీకు తెలుసా! ఈ చేపల గురించి చాలా చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఎందుకంటే.. ఇవి అంటార్కిటికా సముద్ర తీరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.

- వీటి శరీరం పై భాగం నీలి రంగులోనూ, అడుగు భాగం విపరీతమైన తెలుపు రంగులో ఆకర్షించేలా ఉంటాయి. అటూ ఇటూ కోరలు విప్పారినట్టుండే వీటి రెక్కలు చూడగానే భయాన్ని కలిగించేలా ఉంటాయి.
- వీటి శరీరం పాలిపోయినట్టు కనపడడానికి కారణం రక్తంలో హెమోగ్లోబిన్ లేకపోవడమే.
- హెమోగ్లోబిన్ లోపించిన శరీర భాగం తెల్లగా పారదర్శకంగా ఉంటుంది. అంటే మనం మన కిటికీ అద్దం నుండి ఎలా అయితే బైట ఉండే వస్తువులను చూడగలుగుతామో అలా అన్నమాట.
- ఏ జీవికైనా రక్తంలో ఉండే హెమోగ్లోబిన్ ద్వారానే ప్రాణవాయువు (ఆక్సిజన్) శరీర భాగాలకి చేరవేయబడుతుంది.
- హిమోగ్లోబిన్ లేకపోయినా ఐస్ ఫిష్ ఎలా జీవించగలుగుతోందనే విషయం ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ చిక్కు ప్రశ్నలను ఛేదించేందుకు శాస్త్రవేత్తలు వీటిపై 60 ఏళ్లగా పరిశోధనలు చేస్తున్నారు.
- సాధారణంగా చేపలు మొప్పల ద్వారా గాలి తీసుకుంటే ఐస్ ఫిష్‌ల శ్వాసక్రియ వాటి చర్మం ద్వారా నడుస్తోందని కొందరి మాట. రక్తంలో ఉండే ప్లాస్మా ద్వారా వాటికి ఆక్సిజన్ అందుతోందనే మరికొందరి అభిప్రాయం. పసుపు రంగులో ఉండే ప్లాస్మా వల్లే వీటి శరీరంలోని అడుగు భాగం పసుపు అద్దినట్టు కనిపిస్తుంది.



మ్యాచ్ స్టిక్ పజిల్

A ఆకారంలో అమర్చిన అగ్గిపుల్లల్లో కొన్ని పుల్లల స్థానాన్ని మార్చితే మూడు త్రిభుజాలు ఏర్పడతాయి. అదెలాగో ప్రయత్నించండి!



జవాబు:



పదవికాసం - 12

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2	3		4	5		6		
7			8						9
			10	11		12		13	
14		15				16	17		
18	19				20		21		
	22			23		24		25	26
27			28			29	30		
	31	32			33		34	35	
36				37		38		39	40
		41				42			

ఆధారాలు

అడ్డం

1. గ్రంథం (3)
4. ఎట్లు (2)
6. ఎండాకాలంలో జరిగే ప్రమాదాలు (2)
7. ఏ తీరంలో నిశ్శబ్ద మఠం ఉంది 3,7,9,1 (4)
10. ఓ అగ్రరాజ్యం (4)
13. తుదిలేని ఆరంభం (2)
15. నాన్న సోదరి (3)
16. నేటియుగం (4)
18. ఒకే విధమైన అర్థం (4)
20. మ గుణింతంలో మొదటిది (1)
21. స్వీడెన్, ఫిన్లాండ్, రష్యా, డెన్మార్క్ సరిహద్దులు గల యురోపియన్ దేశం (2)
22. అటు నుంచి లోయ (2)
25. మనిషి నోటిలో ఇటువంటివి 32 ఉంటాయి (2)
27. అబల చివర్లో అదృశ్యం (2)
28. కూరుకుపోయే బురద, పంకము (2)
29. వారు అటు నుంచి వచ్చారు (2)
31. అల్లుడు (3)
33. అడ్డం 20తో కలిపి వేసవిలో వాసనలు వెదజల్లే తెల్ల పూలు(1)
34. వ్యవసాయం చేయని భూమిపై నిర్ధారించి వేసే ట్యాక్సు (2)
36. వరుసగా, పొడవుగా (3)
39. అటు నుంచి హిందీలో లేదు, కాదు (2)
41. ధరణి తిరగబడితే (3)
42. ఎనాఫిలిస్ దోమ కుడితే వచ్చే జ్వరం (4)

నిలువు

1. పట్టణం (2)
2. ప్రతిష్టంభన వంటిదే (3)
3. మెడ, కుతిక (2)
5. చీట్లు వేసి అదృష్టం తెలుసుకోవడం (3)
6. హయం (2)
8. ఏ కీడు (4)
9. నాటకరంగం మలి దశలో ఉంది (3)
11. పరుపు, మృదువైన (2)
12. జ్వరం, కోపం (2)
14. సారం, సమృద్ధి, చాతుర్యం (2)
15. పల్లకిలో (3)
17. కింది నుంచి నాలిక చివర తెగింది (2)
19. కలర్లోకి మార్చిన 1957 నాటి ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల బ్లాక్ అండ్ వైట్ సినిమా (5)
23. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవపున్నయ్య షార్ట్ నేమ్ (2)
24. తాగేందుకు లేకుండా -- ఇంకిపోయింది (2)
26. జనకుడు (2)
28. ఆధారం, పట్టుగొమ్మ (2)
30. వర్షమా (2)
32. మెట్ట కాదు (3)
35. దీన్ని మూడుసార్లు అంటే 2002లో హరికృష్ణ, సుమన్, వినీత్ సోదరులుగా నటించిన సినిమా (3)
36. బాల కార్మికులు మొదట్లోనే ఉన్నారు (2)
37. ధర ఎప్పుడూ పైకే (2)
38. పెరట్లో కాచే కాయల చెట్టు (2)
40. కొత్త, తాజా (2)

సుడోకు

6	8		9			4		3
	7			4		6	1	5
1						7	8	
8					4		3	
		3	8		1	9		
	6		3					2
	1	2						7
7	3	6		9			4	
9		8			2		5	6

గతవారం జవాబులు

7	8	9	4	1	2	6	3	5
4	1	5	6	9	3	7	2	8
2	3	6	5	7	8	9	1	4
5	2	1	7	3	4	8	9	6
6	4	3	8	2	9	1	5	7
8	9	7	1	5	6	2	4	3
9	5	8	3	6	1	4	7	2
1	7	4	2	8	5	3	6	9
3	6	2	9	4	7	5	8	1

1 ప్ర	భ		2 యా		3 జ	4 రీ		5 భ	ర్త
ఖ్యా		6 చి	త్రా	లు		7 స	8 ము	ద్రం	
9 తి	10 రు	గు			11 ని	ర్వే	దం		12 జూ
	13 మా	రు	14 తి		ము		15 ఆ	16 ప	ద
17 వా	లు		18 ల	19 లా	ట	ము		20 పో	రు
ర్త		21 ఒ	క	టీ			22 సో	దా	లు
	23 అ	లు	ము		24 మ	25 ని	మ	ని	
26 వి	మ	కు		27 మ	హ	త్యం			28 ఈ
29 లీ	ర్యా		30 రే		ర్షి		31 చ	32 రా	
33 నం	ద	న		34 యి		35 స	ల్ల	ధ	నం

గోళీల సంగీత యంత్రం



చిన్ననాటి గురుతుల్లో ఒకటైన గోళీల సవ్వడి అంటే ఇష్టమా? వింటర్‌గాటన్‌కైతే వాటి గలగలల్లో సంగీత హోరు వినిపిస్తుంది. తాను అనుభూతించింది మనకు వినిపించాలని గోళీలతో ఓ అద్భుతమైన సంగీత పరికరాన్ని సృజించాడు స్వీడన్‌కు చెందిన మార్టిన్ మోలిన్ వింటర్‌గాటన్. వయోలిన్, గిటార్‌ల తంత్రి వాద్యం, పియానో మెలోడీలు ఇలా అనేక పరికరాల సంగీతాన్ని ఇదొక్కటే లయబద్ధంగా ఓ థీమ్‌లో పలికించేస్తుంది. రెండేళ్లు శ్రమించి రూపొందించిన దీనిలో 3 వేల అంతర్గత భాగాలుంటాయి. మొత్తం 2 వేల స్టెయిన్‌లెస్ స్టీల్ గోళీల కదలికల ద్వారా సంగీతం జనిస్తుంది. ప్రధాన నిర్మాణమంతా కలపతోనే. ఓ భారీ యంత్రాన్ని ఎలా అయితే పుల్లీలు, గేర్లు, లీవర్ల ద్వారా పనిచేయిస్తామో వింటర్‌గాటన్ పరికరాన్ని అలానే నడపాల్సి ఉంటుంది. పరికరాన్ని మీటుతున్నట్టు అనిపించదు, యంత్రాన్ని ఆపరేట్ చేస్తున్నట్టు ఉంటుంది. వేరే చోటకు తీసుకెళ్లాలంటే ఒక్కో భాగాన్ని ఊడదీయాల్సిందే. ఇదో సంగీత యంత్రం.

మధురమైన ప్రతిక్షణం,
నిలుస్తుంది జీవితాంతం
రాబోతున్న కొత్త సంవత్సరం,
అలాంటి క్షణాలెన్నో
అందించాలని ఆశిస్తున్నాము

Toll free: 18005997899

ఆంధ్రప్రదేశ్ ఫోన్ నెంబర్లు:
9440797807, 9440797881
9440797840
తెలంగాణ ఫోన్ నెంబర్లు:
9440797846, 9440797816
9440797888

రైతు మిత్రులకు మరియు మా శ్రేయోభిలాషులకు
ఉగాది మరియు శ్రీరామనవమి
శుభాకాంక్షలు

తక్కువ నీటితో ఎక్కువ పంటలు

జైన్
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్
హైదరాబాద్ ఫోన్ నంబర్లు : 040-2761-4474, 2761-1706,
ఆంధ్రా ఫోన్ నంబర్లు : 9440797807, 9440797881, 9440797840
తెలంగాణ ఫోన్ నంబర్లు : 9440797846, 9440797816, 9440797888



అమెరికా నెవడాలోని 'ది వ్యాలీ ఆఫ్ ఫైర్' (అగ్నిలోయ) రహదారి

నార్వేలోని 'ది అట్లాంటిక్ రోడ్'

గమ్యం.. గమనం.. మరిపించి...

ప్రయాణం ఓ మరపు రాని జ్ఞాపకం కావాలంటే.. దాన్నో బహుమతిగా మనకు మనమే ఇచ్చుకోవాలంటే. లేదా ఈ జీవితానికి చాలనే సంతృప్తి ఓ మైలు మార్గంలోనే కలగాలంటే.. ఈ దారుల్లో తప్పిపోవాలి. గమ్యాన్ని, గమనాన్ని, సుదూరాల్ని మరిపించే రహదారులివే. ప్రకృతి సోయగాలతో మనల్ని మైమరిపించే వాటిల్లో కొన్ని వయ్యారాల గమ్యాలివే..

చైనాలోని తియాన్మెన్ పర్వత రహదారి



దక్షిణాఫ్రికాలోని 'చాప్‌మన్స్ పీక్ డ్రైవ్'

ఉత్తర కాలిఫోర్నియా-వర్జీనియాల రహదారి 'ది బ్లూ రిడ్జ్ పార్క్‌వే'

Check List

Book Number	KNSR02B118	Date	03/09/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29